
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 22 మే 2025



జలమయం

- జిల్లాలో భారీ వర్షం
- మచిలీపట్నంలో అత్యధికంగా 41.2 మిల్లీమీటర్ల వర్షం
- నేడు, రేపు, ఎల్లుండి వర్షాలు

మచిలీపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బుధవారం ఉదయం, మధ్యాహ్నం సమయంలో ఒకమోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం 8.30 గంటల వరకు నాగాయలంకలో అత్యధికంగా 24.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా నందివాడలో 1.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది, జిల్లా సగటు వర్షపాతం 7.3 మిల్లీమీటర్లుగా ఉంది. కోడూరులో 18.6 మిల్లీ మీటర్లు, మోపిదేవిలో 14.8, ఘంటసాలలో 13.8, అవనిగడ్డలో 12.2, మొవ్వలో 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చల్లపల్లి, ఉయ్యూరు, మచిలీపట్నం, గూడూరు, తోట్లవల్లూరు, గుడివాడ, పామర్రు, పెడన, కంకిపాడు, ఉంగుటూరు, గుడ్లవల్లేరులో ఎనిమిది నుంచి ఐదు మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. కాగా, ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పలు ప్రాంతాల్లో ఒకమోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మచిలీపట్నంలో అత్యధికంగా 41.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా నాగాయలంకలో 1.2 మిల్లీమీటర్లు, జిల్లా సగటు వర్షపాతం 7.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. బంటుమిల్లిలో 28.4, కంకిపాడులో 18.0, గూడూరులో 17.4, తోట్లవల్లూరులో 15.4, పెనమలూరులో 11.2, కృత్తివెన్నులో 10.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కోస్తాతీరం వెంబడి గురు, శుక్ర, శనివారాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణశాఖ హెచ్చరించింది.

అడ్డంకులు!

నత్తనడకన బియ్యం కార్డుల జారీ

- సచివాలయాల్లో పనిచేయని సర్వర్‌లు
- వచ్చిన దరఖాస్తులు 13,500
- అధికశాతం పెండింగ్‌లోనే..
- పక్కనపడేస్తున్న వితంతువుల దరఖాస్తులు
- మరో వారం రోజుల్లో మొత్తం ప్రక్రియ పూర్తయ్యేనా!

జిల్లాలో కొత్త బియ్యం కార్డుల జారీ, చేర్పులు, మార్పుల ప్రక్రియ ప్రహసనంగా మారింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త కార్డుల కోసం ఆన్‌లైన్ చేసేందుకు ప్రయత్నిస్తుంటే సర్వర్‌లు మొరాయిస్తున్నాయి. ఒక్కో కార్డు వివరాల నమోదుకు అధిక సమయం పడుతోంది. దీంతో రోజుకు 20 కార్డుల వివరాలు కూడా నమోదు చేయలేకపోతున్నారు. ఫలితంగా కొత్తగా బియ్యం కార్డులు కావాల్సిన వారు, చేర్పులు, మార్పులు చేయించుకోవాల్సిన వారు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకే సమయం ఉండటంతో కార్డుల కోసం తిరిగే వారు ఆందోళన చెందుతున్నారు.



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో 5,22,589 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డులో చేరికలు, తొలగింపులు, అడ్రస్ మార్పు, కొత్తకార్డుల జారీ కోసం ఈ నెల 7వ తేదీ నుంచి సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. బుధవారం నాటికి 13,500లకుపైగా దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 508 సచివాలయాలు ఉండగా, వాటిలో ఉన్న కంప్యూటర్లు సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో కొత్త బియ్యం కార్డులకు సంబంధించిన వివరాలు నమోదు చేయడానికి ఆలస్యమవుతోంది. కొన్ని సచివాలయాల్లోని ల్యాప్‌టాప్‌ల్లో ఈ వివరాలు నమోదు చేస్తున్నారు. వీఎస్‌డబ్ల్యూఎస్ సర్వర్‌లో ఈ వివరాలు నమోదు చేయడానికి ప్రయత్నిస్తే సర్వర్ సేవలు అందుబాటులో లేక తీవ్ర ఆలస్యమవుతోంది. కుటుంబం పెద్ద మరణిస్తే ఆయన భార్య ఒక్కరికే బియ్యంకార్డు ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవకాశం లేకపోవడంతో ఈ తరహాలో వచ్చిన దరఖాస్తులను సచివాలయ సిబ్బంది పక్కనపెట్టేస్తున్నారు. వీటిపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చేవరకు తామేమీ చేయలేమంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా చేయించిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను ఆధారంగా చేసుకుని కొత్త బియ్యం కార్డుల జారీకి సంబంధించిన ప్రక్రియను చేస్తుండటంతో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల కాలంలో వివాహం చేసుకుని వేరే గ్రామానికి వచ్చిన మహిళల ఆధార్ కార్డు నెంబర్లు పుట్టిన గ్రామంలో నమోదై ఉండటంతో శుభలేఖ, వివాహ రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకురావాలని ఆంక్షలు పెట్టారు. ఈ అంశంపై ప్రజల నుంచి పలు విజ్ఞప్తులు రావడంతో భార్యభర్తలు ఇద్దరూ వచ్చి ఈకేవైసీ చేయించుకుంటే కొత్తకార్డు ఇచ్చేలా వెసులుబాటు కల్పించారు.

సర్వర్ సామర్థ్యం పెంచేలా చర్యలు : డీఎస్‌వో పార్వతి

కొత్త బియ్యం కార్డుల జారీ, చేర్పులు, మార్పుల కోసం జిల్లాలో ఇప్పటి వరకు 13,500లకుపైగా దరఖాస్తులు వచ్చాయని డీఎస్‌వో (జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి) పార్వతి తెలిపారు. సర్వర్ సమస్య కారణంగా వీటి వివరాలు నమోదు చేయడంలో ఆలస్యం అవుతోందన్నారు. కొత్తకార్డుల జారీ, చేర్పులు, మార్పుల సమయంలో తలెత్తుతున్న ఇబ్బందులను ఇప్పటికే ఉన్నతాధికారులకు వివరించామని తెలిపారు. పౌరసఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసఫరాలశాఖ కమిషనర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని చెప్పారు. గురువారం నుంచి సర్వర్ సామర్థ్యం పెంచడంతోపాటు కార్డుల జారీలో నెలకొన్న సమస్యలన్నింటినీ సరిచేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని వివరించారు. కాగా, జేసీ గీతాంజలిశర్మ జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్‌లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొత్త బియ్యం కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని ప్రారంభించి యోగాసనాలు ప్రదర్శిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, అధికారులు

ఈ-చలానాకు ప్రత్యేక కౌంటర్

ట్రాఫిక్ కాంప్లెక్స్‌లో ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారు చేసే జరిమానాల చెల్లింపుల కోసం అధునాతన కౌంటర్‌ను పోలీసులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంజీ రోడ్డులోని ట్రాఫిక్ కాంప్లెక్స్‌లో ఈ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి ప్రారంభమైంది. ఇంతకుముందు యూపీఎస్సీ (యూనిఫైడ్ పోలీస్ సర్వీసు సెంటర్) వెటర్నరీ ఆసుపత్రికి పక్కన ఉండేది. ఇందులోనే పోలీసుల సేవలకు చేసే చెల్లింపులకు సంబంధించిన కౌంటర్లు ఉండేవి. ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన చలానాలనూ ఇక్కడే చెల్లించేవారు. ఈ భవనంలో టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో యూపీఎస్సీని సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌కు పక్కన ఉన్న పాత టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలోకి తరలించారు.

సమస్యలకు చెక్ పెట్టేందుకే..

ట్రాఫిక్ పోలీసులు నగరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విస్తృతంగా నిర్వహిస్తున్నారు. జరిమానా విధించిన వెంటనే దాన్ని చెల్లిస్తే గానీ పోలీసులు వాహనాన్ని విడిచిపెట్టట్లేదు. వాస్తవానికి మూడు నెలల్లోపు చలానా చెల్లించాలి. చాలామంది వాహనదారులు ఈ గడువు దాటినా చెల్లించట్లేదు. దీంతో పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. ఆన్‌లైన్‌లో చెల్లించాలంటే వాహనదారుల మొబైల్ ఫోన్లలో ఈ పరివాహన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాల్సి వస్తోంది. ఒక్కోసారి నెట్‌వర్క్ సమస్య రావడంతో యాప్ డౌన్‌లోడ్ కావట్లేదు. ఫలితంగా వాహనదారులకు, ట్రాఫిక్ పోలీసులకు మధ్య వివాదాలు జరుగుతున్నాయి. దీంతో నగరం మధ్యలో ఉండేలా సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న కౌంటర్‌ను బందరు రోడ్డులోని ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోకి మార్చారు. ఈ కౌంటర్ 24/7 పనిచేస్తుందని అధికారులు తెలిపారు.

టెండర్ల మాయాజలం



- గ్రామీణ నీటి సరఫరా విభాగంలో మరో మాయ
- రెండు జిల్లాల్లో నాలుగు పంపింగ్ స్టేషన్ల నిర్వహణకు టెండర్లు
- తాత్కాలిక కాలానికి జనవరిలో ఓ కాంట్రాక్టర్‌తో ఒప్పందం
- అయినా పాత కాంట్రాక్టర్‌తోనే పనుల కొనసాగింపు
- కొత్త కాంట్రాక్టర్ టెండర్‌ను ఎక్కువకు కోట్ చేయడమే కారణం
- ఐదు నెలల కాలానికి రూ.50 లక్షల వరకు దండుకునే యత్నం
- కాంట్రాక్టర్లతో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారుల మిలాఖత్

గ్రామీణ నీటి సరఫరా విభాగంలో టెండర్ల మాయాజాలం నడుస్తోంది. రెండు జిల్లాల్లో నాలుగు మంచినీటి పంపింగ్ స్టేషన్లకు సంబంధించిన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) టెండర్లలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడువు తీరినా పాత కాంట్రాక్టరే నీటి నిర్వహణ చేపడుతుండటం, అగ్రిమెంట్ కుదుర్చుకున్నాక కూడా కొత్త కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడం వెనుక పెద్ద కథే నడిచిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఉన్నతాధికారుల తీరు వివాదాస్పదంగా మారుతోంది. ఇప్పటికే అనేక టెండర్ల వ్యవహారాలు వివాదాలమయం కాగా, తాజాగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో పిలిచిన ఓఅండ్ఎం మంచినీటి పంపింగ్ స్టేషన్ల టెండర్లను కూడా అపహాస్యం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో చిల్లకల్లు, గౌరవరం, లింగాల ఓఅండ్ఎం స్కీమ్‌లకు, కృష్ణాజిల్లాలో మొవ్వ ఓఅండ్ఎం పంపింగ్ స్టేషన్లకు కొద్దినెలల కిందట టెండర్లు పిలిచారు. నీటిని శుద్ధిచేసి గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసే వ్యవస్థను ఓఅండ్ఎం పంపింగ్ స్టేషన్లు అంటారు. ప్రజారోగ్యంలో కీలకపాత్ర పోషించే ఈ స్టేషన్ల నిర్వహణ టెండర్ల విషయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనివెనుక భారీ ఎత్తున ముడుపుల పర్వం నడిచిందన్న ఆరోపణలు వస్తున్నాయి.

పాత కాంట్రాక్టర్‌తోనే పనులు

వాస్తవానికి ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి ఏడాది కాలానికి టెండర్లు పిలుస్తారు. ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 నాటికి అన్నమాట. జడ్పీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో శాంక్షన్లు రావు. ఈ కాలాతీతాన్ని బట్టి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాత్కాలికంగా టెండర్లు పిలుస్తుంటారు. ఈ కోవలోనే తాత్కాలిక కాలానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎన్టీఆర్ జిల్లాలో 3, కృష్ణాజిల్లాలో 1 ఓఅండ్ఎం పంపింగ్ స్టేషన్ల నిర్వహణకు టెండర్లు పిలిచారు. ఈ నాలుగు పంపింగ్ స్టేషన్ల టెండర్లను ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. జనవరి 18న అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. ఆరోజు నుంచే కాంట్రాక్టర్ పనిచేయాల్సి ఉంటుంది. కానీ, నాలుగు నెలలు గడిచి, ఐదో నెలలోకి ప్రవేశించినా కొత్త కాంట్రాక్టర్ వాటిని స్వాధీనం చేసుకుని నిర్వహించలేదు. పాత కాంట్రాక్టరే ఇప్పటికీ వాటిని నిర్వహిస్తున్నాడు. దీనివెనుక పెద్ద కథే నడిచింది. పాత కాంట్రాక్టర్ గతంలో 5 శాతం ఎక్కువకు కోట్ చేశాడు. కొత్త కాంట్రాక్టర్ 18 శాతం తక్కువకు కోట్ చేశాడు. దీంతో ఓఅండ్ఎం నిర్వహణకు కాంట్రాక్టర్లకు చెల్లించే ధరలో వ్యత్యాసం ఏర్పడింది. పాత కాంట్రాక్టర్ ఈ పనులు చూస్తే నెలకు దాదాపు రూ.10 లక్షల వరకు ఆదా అవుతుందని తెలుస్తోంది. ఈ లెక్కన ఈ నాలుగున్నర నెలల కాలానికి, ఆ తర్వాతకు దాదాపు రూ.అరకోటి వరకు ఆదా అయ్యే అవకాశం ఏర్పడింది. దీంతో ఇంకా పాత పద్ధతిలోనే బిల్లుల చెల్లింపు వల్ల ప్రభుత్వంపై భారం పడుతోంది. ఇంత జరుగుతున్నా అదనపు కాలం పనిచేస్తున్న పాత కాంట్రాక్టర్, అగ్రిమెంట్ చేసినా పనులు చేపట్టని కొత్త కాంట్రాక్టర్ మిగతా 6లో..

ముడుపులు అందాయా?

ఓఅండ్ఎం పంపింగ్ స్టేషన్ల నిర్వహణను ఇంకా పాత కాంట్రాక్టరే చేపడుతుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. కొత్త కాంట్రాక్టర్, పాత కాంట్రాక్టర్ మధ్య అవగాహన కుదరడంతో పాటు ఈ ఇద్దరితో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు కూడా చేతులు కలిపారన్న ఆరోపణలు వస్తున్నాయి. అదనంగా చెల్లించే డబ్బును దండుకునే ప్రణాళికలో భాగంగానే ఈ వ్యవహారం నడిచిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

సమస్యలతో సతమతం!

- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- అభివృద్ధికి నోచుకోని పంట కాలువలు
- నత్తనడకన సాగుతున్న గృహ నిర్మాణాలు
- జగనన్న కాలనీల్లో తిష్ట వేసిన సమస్యలు
- పాఠశాలలు, పీహెచ్‌సీ భవన నిర్మాణాల్లో జాప్యం
- సమస్యలపై నిలదీయనున్న ప్రజాప్రతినిధులు

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జెడ్పీ కన్వెన్షన్ హాలులో గురువారం ఉదయం జరగనుంది. జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి, వాటి పరిష్కారాలపై నిర్ణయం తీసుకోనున్నారు. ప్రధానంగా గృహ నిర్మాణంలో జాప్యం, ఇసుక రేవుల్లో అక్రమాలు, ఖరీఫ్‌కు సాగునీటి విడుదల తేదీ ప్రకటన, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం తదితర అంశాలు చర్చకు రానున్నాయి. వివిధ అభివృద్ధి పనులు, పంట కాలువలు, డ్రెయినేజీల నిర్వహణ పనులు, నిధుల విడుదల తదితర అంశాలపై కూడా చర్చించి తగు నిర్ణయాలు తీసుకోనున్నారు.



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: రబీలో దాళ్వా పంటకు సాగునీటిని విడుదల చేయలేదు. పంట కాలువలు, డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేసేందుకు అవకాశం ఉన్నా సకాలంలో పనులకు అనుమతులు ఇవ్వలేదు. గతేడాది జిల్లాలోని పంట కాలువల అభివృద్ధి, తూడు తొలగించే పనులకు రూ.26 కోట్లను విడుదల చేశారు. అయినా పనులు సక్రమంగా చేయలేదు. ఈ ఏడాది ఈ నిధుల్లో కోతపెట్టారు. నియోజకవర్గానికి కేవలం రూ.2 కోట్లే కేటాయించారు. గతంలో నియోజకవర్గానికి రూ.3 కోట్లు ఇస్తామని చెప్పినా.. ఈ నగదును ఇటీవల కాలంలో రూ.2 కోట్లకు కుదించారు. రూ.10 లక్షల వరకు వ్యయం అయ్యే పనులను చేసేందుకు సాగు నీటి సంఘాలకు నామినేషన్ పద్ధతిన కేటాయింపులు జరిపారు. కానీ పరిపాలనాపరమైన అనుమతులు ఇంతవరకు రాలేదు. ఈ అంశంపై చర్చించేందుకు సభ్యులు సిద్ధమవుతున్నారు.

సాగునీటి విడుదలపై స్పష్టత వచ్చేనా?

జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. మరో పది రోజుల్లో ప్రారంభం కానున్న ఖరీఫపఫ్‌కు కాలువలకు సాగు నీటిని జూన్‌లో ఏ తేదీన విడుదల చేస్తారనే అంశంపై ఈ సమావేశంలో చర్చించి, తేదీని మిగతా 6లో..



చరిత్ర తిరగరాసేలా మహానాడు

మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ మినీ మహానాడులో మంత్రి కొల్లు రవీంద్ర

8

అన్నదాత సుఖీభవ విధివిధానాలు ప్రకటించాలి

25న ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజల భాగస్వామ్యంతోనే అగ్ని ప్రమాదాల నివారణ



న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేస్తున్న ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జడ్జి సుధ

మోపిదేవి, మే 21 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని తెలంగాణ హైకోర్టు జడ్జి పి.సుధ కుటుంబసమేతంగా బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనా నాయక్, అర్చకులు

దుర్గమ్మ సేవలో మంత్రి అచ్చెన్నాయుడు

ఇంద్రకీలాద్రి, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు దర్శించుకున్నారు. ఆయనకు ఈవో వీకే శీనానాయక్ ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీస్సులు, అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

దాతల విరాళాలు

దేవస్థానంలో అన్నవితరణ నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన ఎం.పద్మారావు బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. విజయవాడకు చెందిన ఎన్.గోపాలరావు గర్భాలయ శిఖర స్వర్ణతాపడానికి రూ.1,00,116లు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అమ్మవారి దర్శనం అనంతరం లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

28న గన్నవరంలో జాబ్‌మేళా

విజయవాడ, మే 21 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గ యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈనెల 28న ఉదయం 9 గంటల నుంచి ఈ మేళా జరుగుతుందని తెలిపారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ పాస్ అయిన వారు అర్హులన్నారు. జాబ్ మేళాలో ఉమ్మడి కృష్ణా, ఏలూరు జిల్లాలోని పదికి పైగా ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఫోటోలు, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 94940 05725, 63006 18985, 96666 54641 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గన్నవరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు.



రోగిని పరీక్షిస్తున్న జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ అంబటి వెంకట్రావు

గన్నవరంలో లెప్రసీ కేసు నమోదు

» నిర్ధారించిన జిల్లా అధికారి

గన్నవరం, మే 21 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలంలో లెప్రసీ కేసు నమోదైనట్టు జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ అంబటి వెంకట్రావు తెలిపారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని టీబీ సెంటర్‌ను ఆయన సందర్శించారు. దావాజీగూడెంకు చెందిన వ్యక్తికి వ్యాధి లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకూ 72 లెప్రసీ కేసులు ఉన్నాయని మరొకటి నిర్ధారణ చేసినట్టు చెప్పారు. రోగికి సంవత్సరం పాటు ఉచిత వైద్యాన్ని అందిస్తామని తెలిపారు. పౌష్టికాహారం తీసుకుంటూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను సక్రమంగా వాడితే ఏడాదిలోపు నయం అవుతుందని చెప్పారు. ఈ వ్యాధి వ్యక్తి నుంచి మరొకరికి సులభంగా వ్యాపించదని చెప్పారు. కుష్టు వ్యాధికి మందులు అందుబాటులో ఉన్నాయని ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కేసరపల్లి లెప్రసీ కాలనీలో గతంలో 14 మంది లెప్రసీ రోగులు ఉండేవారని ఇద్దరు చనిపోయారని తెలిపారు. జిల్లా న్యూక్లియస్ అధికారి డాక్టర్ వేణు, వి.సాంబశివరావు, బి.సురేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై విజిలెన్స్ ఆరా!

హనుమాన్‌జంక్షన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో బాపులపాడు మండలంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమ నిర్వహణపై విజిలెన్స్ అధికారులు బుధవారం విచారణ నిర్వహించారు. బాపులపాడు మండల పరిషత్ కారాలయంలో ఎంపీడీవో కె.జోగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులతో అధికారులు సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్త విచారణల్లో భాగంగా మండలంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమ నిర్వహణ లావాదేవిలపై వివరాలు సేకరించారు. కార్యక్రమ నిర్వహణకు గ్రామ సచివాలయ స్థాయి పోటీలకు రూ.10వేలు, మండల స్థాయికి రూ.25వేలు చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించింది. వాటి జమా ఖర్చుల వివరాలను అడిగితెలుసుకున్నారు.. కొంతమంది కార్యదర్శులు బదిలీపై వెళ్లిన నేపథ్యంలో గురువారం వరకు సమయం కావాలని కార్యదర్శులు కోరినట్టు ఎంపీడీవో తెలిపారు.

వైద్యుల పనితీరులో మార్పు రావాలి

» రోగులకు వైద్య సేవలందించడంలో ప్రభుత్వ ఆసుపత్రిని అగ్రస్థానంలో నిలపాలి
» అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు
» పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురై చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితిలో నిరుపేదలు వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రులకు వస్తారని, అలాంటి వారికి మెరుగైన వైద్యం అందించడం దైవసేవతో సమానమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. రోగులకు మెరుగైన సేవలందించడంలో ప్రభుత్వాసుపత్రిని అగ్రస్థానంలో నిలిపేలా టీం జీజీహెచ్ స్ఫూర్తితో పనిచేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం బుధవారం చైర్మన్, కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వాసుపత్రిలో చేపట్టాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించి, పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడంలో ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాల్సిన అవసరముందన్నారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల పనితీరుపై సేకరించిన ప్రజాభిప్రాయ నివేదిక ప్రకారం విజయవాడ సర్వజనాసుపత్రిలో వైద్యుల సేవలు, సిబ్బంది పనితీరు, మందుల సరఫరా, పారిశుధ్యం ఆశించిన స్థాయిలో లేకపోవడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. దీనిపై వైద్యాధికారులు పునరాలోచన చేయాల్సిన అవసరముందన్నారు. సమావేశాలు మౌలిక వసతుల అభివృద్ధి పనులకే పరిమితం కాకూడదన్నారు. అభివృద్ధితో పాటు వైద్యులు, సిబ్బంది అందించే సేవలు పేద రోగులకు సంతృప్తికరంగా ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు సాధించేందుకు అవకాశముంటుందన్నారు. దీనికోసం అన్ని విభాగాధిపతులు, సిబ్బంది సమష్టి కృషి అవసరమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల సేవలపై నమ్మకాన్ని కలిగించినట్టయితే ఎన్ని నిధులైనా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే అతి పెద్ద ఆసుపత్రుల్లో ఒకటైన విజయవాడ సర్వజనాసుపత్రిలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందని, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు రోగులకు మరింత నాణ్యమైన సేవలందించడంలో అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర విజన్-2047 దార్శనికత లక్ష్యాలను చేరుకొనేందుకు అనుగుణంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సేవలందించాలని సూచించారు. రోగులకు భరోసా కల్పించేలా సేవలందించాలన్నారు. సమావేశంలో అదనపు డీఎంఈ డాక్టర్ వెంకటేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆర్ఎంవోలు, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం!

(5వ పేజీ తరువాయి)

ప్రకటించాలని రైతులు కోరుతున్నారు. కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి నీటిని విడుదల చేస్తున్నారు. పంట కాలువల్లో తూడు, గుర్రపు డెక్క తొలగించాల్సి ఉండటంతో కాలువలకు నీటిని విడుదల చేయడంలేదు. పులిచింతల ప్రాజెక్టులో 20 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ఈ నీటిని కృష్ణాడెల్టాలో పంటల సాగుకు ఎప్పుడు విడుదల చేస్తారనే అంశంపై నేడు జరగనున్న జిల్లా పరిషత్ సమావేశంలో చర్చించి సముచిత నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కరువు

ఉమ్మడి జిల్లాలో 1400లకుపైగా జగనన్న కాలనీలు ఉన్నాయి. వాటిలో కనీస వసతులు కరువయ్యాయి. రోడ్లు, తాగునీటి పైప్‌లైన్లు, విద్యుత్ లైన్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. కొంతకాలంగా గృహ నిర్మాణాల్లో అంతగా పురోగతి లేదు. పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాల్లో ఆలస్యం జరుగుతోంది. వీటిపై జెడ్పీ సమావేశాలు జరిగిన ప్రతిసారి సభ్యులు ప్రశ్నిస్తూనే ఉన్నారు. అధికారులు అనుమతులు వస్తాయి.. పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు.. కానీ పనులు మాత్రం జరగడం లేదు. ఈ సమావేశంలో వీటిపై చర్చించి సముచిత నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం నిధులతో చేస్తున్న పనులు, వివిధ విభాగాల్లో పరిపాలనాపరంగా నెలకొన్న సమస్యలను ఎత్తిచూపుతామని సభ్యులు అంటున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టేనా?

కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. తోట్లవల్లూరు, ఘంటసాల, పెనమలూరు మండలాల పరిధిలో ఇసుక రవాణా మాఫియా చేతుల్లోనే ఉంది. రాత్రి సమయంలో అక్రమంగా వందలాది లారీల్లో ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల అధికారులు ఆవైపునకు కన్నెత్తి చూడటంలేదు. ఇసుక రేవులకు అనుమతులు తెచ్చుకునే విషయంలోనూ మాఫియా తన చెప్పుచేతల్లోనే పెట్టుకుని తెరవెనుక వ్యవహారాలు నడుపుతోంది. ఇసుక రేవుల నుంచి ఇసుకను తరలిస్తున్న వ్యక్తులు వర్గాలుగా ఏర్పడి ఇటీవల కాలంలో దాడులు చేసుకుంటున్నారు. ఇంతా జరుగుతున్నా అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు కనీస చర్యలు తీసుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.


ఎన్టీఆర్ జిల్లా ఎమ్మెల్యేలు డుమ్మా!

జిల్లా పరిషత్ పాలన ఉమ్మడి జిల్లాస్థాయిలోనే కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన శాసన సభ్యులు, కలెక్టర్, జేసీ హాజరు కావడంలేదు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు మాత్రమే హాజరవుతున్నారు. వీరు ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లేదా జేసీ దృష్టికి తీసువెళతామని చెప్పి సరిపెట్టేస్తున్నారు. ఇటీవల జరిగిన జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలకు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఒక్కసారి మాత్రమే హాజరయ్యారు.

సరుకు రవాణా, టిక్కెట్ల ఆదాయంలో

గణనీయమైన ప్రగతి

» డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్



రైల్వే స్టేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : సరుకు రవాణా, ప్రయాణికుల టిక్కెట్ల చార్జీలలో విజయవాడ రైల్వే డివిజన్ గణనీయమైన ప్రగతి సాధించిందని డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. డివిజనల్ రైల్వే వినియోగదారుల సలహా మండలి 133వ సమావేశం బుధవారం డివిజనల్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో డీఆర్ఎం మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక గ్రాస్ రెవెన్యూ రూ.5,836.61 కోట్లు, సరుకు రవాణా ద్వారా రూ.4,239.74 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. మొత్తంగా 38.322 మిలియన్ టన్నులు లోడింగ్ చేసినట్టు తెలిపారు. విజయవాడ డివిజన్ పరిధిలోని 21 ప్రధాన స్టేషన్లను అమృత్ స్టేషన్ స్కీమ్ కింద అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. వావిలపల్లి రాంబాబు మాట్లాడుతూ, రైళ్ల రాకపోకలు, సమయపాలన, ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు తదితరాల విషయంలో చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో సభ్యులు జె.ఎల్.ఎన్. నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ల మాయా'జలం'

(5వ పేజీ తరువాయి)

విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఆడిట్‌కు ఏం సమాధానం చెబుతారు?

టెండరు దక్కించుకున్న కొత్త కాంట్రాక్టర్‌తో తక్కువ ధరకు పనులు చేయించకుండా పాత కాంట్రాక్టర్‌తో ఎక్కువ ధరకు ఎందుకు చేయిస్తున్నారన్న అంశంపై అనుమానాలున్నాయి. ఆడిటింగ్‌లో అ విషయాన్ని ప్రశ్నిస్తే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏం సమాధానం చెబుతారో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

తెరపైకి కొత్త టెండర్లు

ఓపక్క ఈ టెండర్ల వివాదం నడుస్తుండగానే, మరోవైపు కొత్త వివాదానికి తెరలేపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మళ్లీ ఈ నాలుగింటికి కొత్తగా టెండర్లు పిలిచారు. ఈ టెండర్లలో కొత్త, పాత సంస్థలు పాలు పంచుకునేందుకు రంగం సిద్ధం చేశారు. సాధారణంగా ఈ రెండు కాంట్రాక్టు సంస్థలు చేసిన పనికి వారిని బ్లాక్‌లిస్టులో పెట్టాలి. ఈ పనిచేయకపోవటంతో ఉన్నతాధికారులు సదరు సంస్థలతో లాలూచీ పడ్డారన్న ఆరోపణలు వస్తున్నాయి.

అమరావతి పరిరక్షణ ఉద్యమం కేసులో

సిటీ సివిల్ కోర్టుకు టీడీపీ నేతలు

గొల్లపూడి, మే 21 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పరిరక్షణ ఉద్యమంలో భాగంగా గొల్లపూడిలో నిరసన తెలిపినందుకు వైసీపీ ప్రభుత్వం 2020లో పెట్టిన కేసులో విచారణ నిమిత్తం మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు బుధవారం సిటీ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో సీసీ నెం.1868/2020లో దేవినేని ఉమాతో పాటు టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, నర్రా వాసు, నూతలపాటి వెంకటేశ్వరరావు (నారద), వడ్లమూడి చలపతిరావు, ఇరుగులపాటి దిలీప్, శ్రీను నాయక్, రంగినేని నరేంద్ర, షేక్ కరీముల్లా, కారంపూడి సాయి, కోగంటి సూరిబాబు, చిగురుపాటి నాగరాజు, ధనేకుల లక్ష్మయ్య, బొర్రా తిరుపతిరావు, ఆలూరి హరికృష్ణ చౌదరి, ఈదర పూర్ణచంద్రరావు, ఆలూరి సాంబశివరావు, గొరిజాల సాంబశివరావు, కోమటి రామ్మోహనరావు తదితరులు ఉన్నారు. ఈ కేసులో తదుపరి విచారణను జులై 31కి న్యాయాధికారి వాయిదా వేశారు.

నిందితుడికే వత్తాసు!

» హైదరాబాద్ పోలీసుల తీరు
» విచారణకు వెళ్లిన నందిగామ పోలీసుల నిర్బంధం, డీసీపీ అనుచిత వైఖరి
» నగర సీపీ ఆదేశాలతో విడుదల

నందిగామ, మే 21 ఆంధ్రజ్యోతి : లైంగికదాడి, చోరీ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకొనేందుకు వెళ్లిన నందిగామ పోలీసులకు హైదరాబాద్ పోలీసులు చుక్కలు చూపించారు. తప్పుడు కేసులతో అరెస్టు చేసేందుకు వచ్చారా అంటూ నిందితుడిని వెనుకేసుకొచ్చి నందిగామ పోలీసులను నిర్బంధించిన ఘటన సంచలనం కలిగించింది. సేకరించిన సమాచారం ప్రకారం.. గుంటూరులో చార్టెడ్ అకౌంట్ (సీఏ) శిక్షణ ఇస్తున్న ఒక ప్రైవేటు సంస్థలో కఠిక అమరేంద్రరెడ్డి అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. అమరేంద్రరెడ్డి ఆడపిల్లలను ట్రాప్‌చేస్తూ పెళ్లి చేసుకుంటానని మాయచేస్తున్నాడు. ఇటీవల నందిగామ ప్రాంతానికి చెందిన విద్యార్థినిని పెళ్లి చేసుకుంటానని ప్రేమలోకి దింపాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు విద్యార్థినిని చదువు మాన్పించి సమీప బంధువైన నందిగామకు చెందిన మద్దుకూరి సాయిబాబు (చార్టెడ్ అకౌంటెంట్) వద్ద ఉద్యోగంలో పెట్టారు. ఈక్రమంలో మూడు రోజుల క్రితం అమరేంద్రరెడ్డి నందిగామ వచ్చి సదరు చార్టెడ్‌అకౌంటెంట్ కార్యాలయంలోని ఫైళ్లు, హార్డ్ డిస్కులతో పాటు సదరు యువతిని తీసుకొని వెళ్లాడు. ఘటనపై సాయిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇది తెలిసిన మరో యువతి తనపైనా అమరేంద్రరెడ్డి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆన్‌లైన్ ద్వారా నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడైన అమరేంద్రరెడ్డి హైదరాబాద్‌లో ఉన్నట్టు తెలుసుకుని అరెస్టు చేసేందుకు నందిగామ పోలీసులు హైదరాబాద్ వెళ్లారు. హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ రాంప్రసాద్‌లు నిందితుడు ఉంటున్న ఇంటిని సమీపిస్తుండగానే ఎల్‌బీనగర్ స్టేషన్‌కు చెందిన పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అమరేంద్రరెడ్డిని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారంటూ నందిగామ పోలీసులపై మండిపడ్డారు. అరెస్టు వారెంట్‌లు చూపేందుకు ప్రయత్నిస్తుండగానే రాచకొండ కమిషనరేట్‌కు చెందిన డీసీపీ ప్రవీణ్‌కుమార్ వద్దకు బలవంతంగా తీసుకువెళ్లారు. అమరేంద్రరెడ్డిపై తప్పుడు కేసులు పెడతారా అంటూ మండిపడటమేకాక అతడిని అరెస్టు చేయరాదంటూ డీసీపీ హెచ్చరించారు. విషయం తెలుసుకున్న నందిగామ సీఐ విజయవాడ డీసీపీ మహేశ్వరరాజుకు సమాచారం ఇచ్చారు. ఆయన ఎల్‌బీనగర్ డీసీపీతో ఫోన్‌లో మాట్లాడినా ఫలితం లేదు. దీంతో విజయవాడ సీపీ రాజేంద్రనాథ్‌బాబు రాచకొండ సీపీతో ఫోన్‌లో మాట్లాడి విషయం తెలియజేశారు. దీంతో అప్రమత్తమైన ఎల్‌బీనగర్ డీసీపీ నందిగామ పోలీసులను విడిచి పెట్టారు. నిందితుడిని పట్టుకొనేందుకు తాము సహకరిస్తామంటూ, జరిగిన ఘటన విచారకరమని.. నందిగామ సీఐతో మాట్లాడారు. ఇంతలో అమరేంద్రరెడ్డి పరారయ్యాడు. అమరేంద్రరెడ్డిని పట్టుకొనేందుకు సహకరిస్తామంటూ రాచకొండ సీపీ హామీ ఇవ్వడంతో నందిగామ సీఐ వైవీవీఎల్ నాయుడు సిబ్బందితో కలిసి హైదరాబాద్ వెళ్లారు.

రోడ్లు ఛిద్రం!



ఓవర్ లోడ్‌తో వెళుతున్న టిప్పర్, ధ్వంసమైన కృష్ణా తీర ప్రాంత రోడ్డు

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

» లారీల్లో పరిమితికి మించి ఇసుక రవాణా
» కళ్లుమూసుకుంటున్న రవాణా, పోలీసు శాఖలు
» వైసీపీ హయాంలో విచ్చలవిడిగా ఓవర్‌లోడ్
» కూటమి ప్రభుత్వం వచ్చాక.. రోడ్లకు మరమ్మతులు
» భారీ వాహనాలతో మళ్లీ దారులు ధ్వంసం

టైర్ల సంఖ్యను బట్టి రవాణా వాహనాలకు అనుమతి మేరకు లోడింగ్ చేయాల్సి ఉంది. రవాణా అధికారులు పేర్కొన్నట్టుగా పది టైర్ల వాహనానికి 28 టన్నులు, 12 టైర్ల వాహనానికి 35 టన్నులు, 14 టైర్ల వాహనానికి 42 టన్నుల వరకు లోడింగ్ చేయవచ్చు. దీనికి ఐదు శాతం వరకు మార్జిన్ ఉండటంతో ఒకటి నుంచి రెండు టన్నుల వరకు ఎక్కువగా లోడింగ్ చేయవచ్చు.

ఇసుక లారీలు, టిప్పర్ల ఓవర్ లోడ్ భారాన్ని గ్రామీణ ప్రాంతాల రోడ్లు తట్టుకోలేకపోతున్నాయి. ఎక్కడికెక్కడ రోడ్లు నిలువునా కుంగిపోతూ, ఛిద్రమవుతున్నాయి. ఇసుక వాహనాలపై పట్టాలు పక

దుమ్ము రేపుతున్నాయి

డ్బందీగా కప్పకపోవటం ప్రమాదాలకు దారి తీస్తున్నది. ఇసుక రేణువులు కళ్లల్లో పడటం వల్ల ద్విచక్ర వాహనదారులు తరుచుగా ప్రమాదాలకు గురవుతున్నారు.

అయితే ఇసుక లారీలు, టిప్పర్లకు సంబంధించి ఎక్కువగా ఓవర్‌లోడ్ వేస్తున్నారు. అనుమతి మేరకు లోడింగ్ చేయటమన్నది చాలా అరుదు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా విషయంలో ఓవర్ లోడింగ్ కీలక పాత్ర పోషిస్తున్నది. 12 లేదా 14 టైర్ల వాహనాలకు సామర్థ్యం మేరకు 50 నుంచి 70 టన్నుల వరకు కూడా లోడింగ్ చేస్తున్నారు. సామర్థ్యం మేరకు ఇసుక లోడింగ్ చేయని పక్షంలో ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించే వారికి పెద్దగా గిట్టుబాటు కాదు. ముఖ్యంగా తెలంగాణా ప్రాంతానికి తరలించే వాహనాలకు ఓవర్‌లోడ్ వేయటమన్నది పరిపాటిగా మారింది. క్షేత్రస్థాయిలో అధికారులు కూడా పెద్దగా పట్టించుకోవటం లేదు. కొద్ది రోజుల క్రితం రవాణా శాఖాధికారులు నాలుగు టిప్పర్లను పరిశీలించగా, ఇసుక 80 టన్నులున్నట్టుగా గమనించారు. అధిక టన్నేజీ కల్గిన వాహనాల రాకపోకలకు గ్రామీణ ప్రాంతాల రోడ్లు తట్టుకోలేకపోతున్నాయి.



ధ్వంసమవుతున్న గ్రామీణ రోడ్లు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక లారీల పుణ్యమా అంటూ కృష్ణానది తీరంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు నామరూపాలు లేకుండ ధ్వంసమయ్యాయి. బీటీ రోడ్లు మట్టిరోడ్లుగా మారాయి. అడ్డగోలుగా రేయింబవళ్లు వందల సంఖ్యలో ఓవర్ లోడ్ కల్గిన ఇసుక లారీలు, టిప్పర్లు తిరగటం వల్ల కంచికచర్ల నుంచి చెవిటికల్లు వెళ్లే రోడ్డు, కునికినపాడు, మున్నలూరు, మోగులూరు, గని ఆత్కూరు గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. నందిగామ నుంచి వయా చందర్లపాడు మీదుగా పొక్కునూరు వెళ్లే రోడ్డు, ఉస్థేపల్లి వెళ్లే రోడ్డు బాగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్లపై ఎక్కడికెక్కడ పెద్ద గుంతలు పడ్డాయి. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు నరకయాతన పడ్డారు. అయినప్పటికీ వైసీపీ పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రజలు పలు అవస్థలు పడుతున్నప్పటికీ ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించ లేదు. దెబ్బతిన్న రోడ్లను బాగు చేయలేదు. గత ఏడాది టీడీపీ అధికారపగ్గాలు చేపట్టగానే రాకపోకలకు ఆటంకం లేకండ తాత్కాలికంగా రోడ్లను బాగు చేశారు. రోడ్లు బాగున్నాయనుకుంటే.. మళ్లీ ఓవర్ లోడ్‌తో విచ్చలవిడిగా తెలంగాణాకు తరలుతున్న లారీల కారణంగా మళ్లీ డ్యామేజీ ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఈ రోడ్లను పటిష్టం చేసి, అభివృద్ధి చేయాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

తరచుగా ప్రమాదాలు..

ఇసుక లారీలు, టిప్పర్లపై పకడ్బందీగా పట్టాలు కప్పకపోవటం వల్ల రోడ్లపై తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.. వేగంగా వెళ్లే వాహనాల నుంచి ఇసుక రేణువులు గాలికి లేచి పడటంతో వాహనదారులు అదుపుతప్పి కాళ్లు, చేతులు విరగటంతో క్షతగాత్రులవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల రోడ్లపైనే కాకుండా, నందిగామ-విజయవాడ మధ్య జాతీయ రహదారిపైనా ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇసుక అక్రమ రవాణా..

తెలంగాణాకు ఇసుక అక్రమ రవాణాను నిరోధించాల్సిన అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. వాహనాల వద్ద ఎలాంటి పర్మిట్లు లేనప్పటికీ వాటికి ఎలాంటి ఆటంకాలు ఎదురుకావటం లేదు. తెలంగాణాలో ప్రవేశించగానే అక్కడి అధికారులు పట్టుకోవటం విశేషం. అక్రమ రవాణాను నిరోధించేందుకు ఆ దిశగా ఎవరూ చర్యలు తీసుకోవటం లేదు. నందిగామ సబ్ డివిజన్ పరిధిలోని కొందరు కానిస్టేబుళ్లు ఇసుక అక్రమ రవాణాకు సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

జీవనోపాదుల ప్రణాళికపై అవగాహన

పెనమలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపులిపాకలో జీవనోపాదుల ప్రణాళిక, సూక్ష్మరుణ ప్రణాళిక తయారు గురించి స్వయం సహాయక సభ్యులతో డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ అవగాహన కల్పించారు. ప్రస్తుతం సంఘ సభ్యులు చేస్తున్న వ్యాపారం గురించి, కొత్తగా చేయబోయే వ్యాపారాల గురించి సభ్యులకు అవగాహన కల్పించారు. సభ్యులు చేస్తున్న వ్యాపారాలకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీ కేపీ నాయక్, ఏపీఎం కృష్ణంరాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



సభ్యులకు అవగాహన కల్పిస్తున్న పీడీ హరిహరనాథ్

టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడిగా
గొడ్డళ్ల చిన్న రామారావు

విజయవాడ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా గొడ్డళ్ల చిన్న రామారావు నియమితు లైనారు. గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బుధవారం రామారావుకు నియా మకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిన్న రామారావు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రెండవ సారి రూరల్ మండలం బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.



ఘనంగా గణపతి హోమం

హనుమాన్‌జంక్షన్, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీతారామ దాసాంజనేయస్వామి ఆలయంలో వజ్రోత్సవ వేడుకలు బుధవారం ప్రారంభం అయ్యాయి. ఈ నెల 25 వరకు ఆలయ వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు గణపతి హోమాన్ని ఆలయ అర్చకులు పవ నాచార్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకు లు పల్నాటి సత్యనారాయణ, చోడె వెంకయ్య కుటుంబ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

సీతారామ కల్యాణోత్సవం నేడు

స్థానిక లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం సీతారామ కాల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో వై.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



ఏర్పాటు చేస్తున్న భారీ టెంట్లు

మహాశోభాయాత్రకు ఘనంగా ఏర్పాట్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : హనుమజ్జయంతి సందర్భంగా గురువారం నిర్వహించే మహాశోభాయాత్రకు వేలేరులో ఏర్పాట్లు భారీగా జరుగుతున్నాయి. వేలాదిగా తరలివచ్చే భక్తులకు అవసరమైన కుర్చీలు, వర్షం పడినా తడవకుండా వాటర్‌ప్రూఫ్ టెంట్లతో వేలేరు అడ్డరోడ్డు వద్ద వేదిక నిర్మిస్తూ నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. హనుమాన్‌జంక్షన్ కూడలిలోని అభయాంజనేయస్వామి దేవస్థానం నుంచి ఉదయం ప్రారంభమయ్యే మహాశోభాయాత్ర వేలేరు అడ్డరోడ్డు వరకు జరుగుతుందని బుధవారం నిర్వాహకులు తెలిపారు.

అన్నప్రసాద వితరణకు..

హనుమజ్జయంతి సందర్భంగా బాపులపాడు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు వేలేరు అడ్డరోడ్డు వద్ద భారీ అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వేలేరు అడ్డరోడ్డు వద్ద కనుమూరి సూర్యనారాయణరాజు దివ్యఆశీస్సులతో ప్రతిఏటా నిర్వహించినట్లే వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు భారీగా నిర్వహిస్తున్నారు.

ఆర్టీసీ డిపో ఖాళీ స్థలంలో చెట్ల వేలం 24న

గన్నవరం, మే 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో స్థలంలోని టేకు, వేప, గానుగ, దరిశనం, తంగేడు చెట్లను ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం వేలం వేస్తున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో కార్యాలయం వద్ద ఈ వేలం పాట నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.



వీరవల్లిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

సాంకేతిక విప్లవానికి ఆద్యుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి) : సాంకేతిక విప్లవానికి ఆద్యుడు మాజీ ప్రధాన రాజీవగాంధీ అని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నందూరి శ్రీనివాసరావు అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా వీరవల్లిలో ఆయన విగ్రహానికి బుధవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కార్యదర్శి కలపాల నాగేశ్వరరావు, చౌటపల్లి ఆనందరావు, పంతం జక్కురయ్య, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

బిల్లులు రాక.. పనులు సాగక

- అసంపూర్తిగా వెల్దిపాడు పశువైద్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు
- చేసిన పనులుకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో చేతులెత్తిసిన కాంట్రాక్టర్
- ఇబ్బంది పడుతున్న పాడిరైతులు
- పనులు చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్న రైతులు



వెల్దిపాడులో బిల్లులు రాక అసంపూర్తిగా నిలిచిపోయిన పశు వైద్యకేంద్రం

(ఉంగుటూరు - ఆంధ్రజ్యోతి)

మండలంలో వెల్దిపాడు గ్రామీణ పశువైద్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు నిధుల కొరత కారణంగా గత కొన్నేళ్లుగా ముందుకు సాగక అసంపూర్తిగా నిలిచిపోయాయి. గ్రామీణ ప్రాంత పశువులకు మెరుగైన వైద్యసేవలందించడం ద్వారా పాడిపరిశ్రమాభివృద్ధికి తోడ్పాటు నందించాలనే ఉద్దేశంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం శిథిలావస్థకు చేరిన పశువుల ఆసుపత్రిని తొలగించి దాని స్థానంలో నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నాబార్డు ద్వారా మంజూరైన సుమారు రూ.24లక్షల ఆర్‌ఐడీఎఫ్ నిధులతో వెల్దిపాడులో నూతన పశువుల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభించింది. యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ 2019నాటికి 75శాతం మేర పనులు పూర్తిచేశారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. దీంతో వెటర్నరీ ఆసుపత్రి నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు, కరెంట్, వాటర్‌సప్లై, బాత్‌రూమ్స్, ప్రహరీ వంటి నిర్మాణ పనులు పెండింగ్‌లో వుండటంతో ప్రారంభానికి నోచుకోకుండా నిరుపయోగంగా మారింది. ముఖ్యంగా తలుపులు, కిటికీలు అమర్చకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ కె.రమాదేవి ఆందోళన చెందుతున్నారు. స్థానిక సర్పంచ్, రైతుల సహకారంతో నిర్మాణ దశలో వున్న భవనంలోనే చిన్నగదిని ఏర్పాటు చేసుకుని పశువులకు తాత్కాలిక వైద్యసేవలందిస్తున్నామని తెలిపారు. పశువుల ఆసుపత్రుల అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి, పెండింగ్‌లోవున్న పశువుల ఆసుపత్రుల నిర్మాణ పనులు సత్వరమే పూర్తిచేసే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని రైతులు, పశుపోషకులు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత

పెనమలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : షుమారు మూడు కిలోల గంజాయిని అమ్మడానికి ప్రయత్నిస్తూ ఒక యువకుడు పెనమలూరు పోలీసులకు చిక్కాడు. పెనమలూరు ఎస్సై రమేష్ తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ జిల్లా తుని మండలానికి చెందిన అల్లుకార్తీక్ విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి, కానూరులో అతనికి పరిచయమున్న భాను ప్రకాష్, మణికంఠలకు అమ్మడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మిగిలిన ఇద్దరూ పారిపోయారు. వారి కోసం గాలిస్తున్నట్టు ఎస్సై రమేష్ తెలిపారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డ
తండ్రీకొడుకుల అరెస్టు

పెనమలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై విజయవాడకు చెందిన తండ్రీకొడుకులు దాడి చేసిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెనమలూరు ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఉండ్రకొండ సోమశేఖర్ బుధవారం కానూరు అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వర్తిస్తున్నాడు. నోపార్కింగ్ ఏరియాలో వాహనాలు నిలపవద్దని, ఆటో తీసివేయమని ఒక ఆటోలోని తండ్రీకొడుకులకు తెలపగా వారు కానిస్టేబుల్‌పై దాడికి దిగారు. ఇద్దరూ అతనిని తోసివేయడంతో కానిస్టేబుల్ పక్కనే ఉన్న కారుపై పడిపోయాడు. ఇంతలో పోలీసు రక్షక్ వాహనం వచ్చి దాడికి పాల్పడ్డ అబ్దుల్ హఫీజ్, అతని కుమారుడు అబ్దుల్ హల్తాఫ్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

ఉత్సవమూర్తికి సప్తనదీ జలాభిషేకం

హనుమాన్‌జంక్షన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉత్సవ మూర్తికి సప్తనదీ జలాలతో నవకలశ స్నపన అభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో పాటు సింధూరార్చన, మన్యుసూక్తహోమం, పాశుపత హోమాలు ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ నిర్వహిం చారు. అనేక మంది భక్తులు పాల్గొని హోమ పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద జంక్షన్‌కు చెందిన విజయదుర్గా కోలాటం బృందం మహిళలు కోలాటం ప్రదర్శించారు. కాగా గురువారం జయంతిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఆలయం వద్ద భక్తుల కోలాటం

ఆంజనేయస్వామికి అభిషేకాలు

గన్నవరం, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దావాజీగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలోని ఉపాలయంలో అభయాంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న హనుమాన్ జయంతి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కలశాల గోక్షీరంతో, 27 రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. 41 కేజీల చందనంతో స్వామివారికి అలంకారం చేశా రు. ఆలయ అర్చకులు రామాచార్యులు ఆధ్వర్యంలో విశేషపూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



అంకమ్మతల్లి జాతర ప్రారంభం

ఉయ్యూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు లో జంపాన వారి అంకమ్మ తల్లి జాతర బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఐదురోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే అంకమ్మ తల్లి జాతర మొదటిరోజు కోలపట్టు, దేవతల ఆనకట్టుట, జ్యోతికపిరి, చాట్లకపిరి, పూలకపిరి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళా లు, సన్నాయి వాయిద్యాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ జంపాన పూర్ణ చంద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు శివయ్య, రవి, రుద్రయ్య తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. జాతర ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు అంకగుడారం కార్యక్ర మంతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.



యోగాపై అవగాహన

ఉయ్యూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఆకునూరు ప్రభుత్వ పాఠశాల్లో బుధవారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని మండల అధికారులు నిర్వహించారు. జూన్ 21న నేషనల్ యోగా డే రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న నేప థ్యంలో మండలస్థాయి అధికారుల కమిటీ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పించి యోగాసనాలు అభ్యసించారు. మండల స్థాయిలో యోగాపై వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాలన్న జిల్లా ఉన్నతా ధికారుల ఆదేశం మేర కార్యక్రమాలు చేస్తున్నట్టు ఆర్డీవో హేలా షారోన్ తెలిపారు. ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరి రావు, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆకునూరు సర్పంచ్ గోలి వసంతకుమార్, కాకాని శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిబ్బంది కృషి

ఉంగుటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిబ్బంది నిరంతరం కృషి చేస్తారని ఏఈ జె.దుర్గారావు అన్నారు. తేలప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి సిబ్బంది వివరాలను బుధవారం విలేకరులకు వెల్లడించారు. తేలప్రోలు సెక్షన్ ఏఈ/ఆపరేషన్స్ జల్లిపల్లి దుర్గారావు (9490156503), లైన్‌ఇన్‌స్పెక్టర్ కే.సురేష్‌రాజు (7989150064), తేలప్రోలు, సీతారాంపురం, పొట్టిపాడు, నారయ్యఅప్పారావుపేట, ఆనందపురం, బండారుగూడెం లైన్‌మెన్ సురేంద్రబాబు (9959587277), తేలప్రోలు అసిస్టెంట్ లైన్‌మెన్ లాల్ అహ్మద్ (9550824119), బండారుగూడెం జెఎల్ఎం గ్రేడ్-2 సాహెన్నా (9398870611), సీతారాంపురం, తేలప్రోలు, జెఎల్ఎం గ్రేడ్-2 కె.రామాంజనేయులు(8074083540), పొట్టిపాడు, నారయ్యఅప్పారావుపేట, ఆనందపురం జెఎల్ ఎం గ్రేడ్-2 శ్రీమన్నారాయణ (8639707958), పెదఅవుటపల్లి, ఆత్కూరు లైన్‌మెన్ మొక్కపాటి రాజశేఖర్ (9248149899), పెదఅవుటపల్లి జెఎల్ఎం గ్రేడ్-2 ఎం.రాజశేఖర్ (7095112773), ఆత్కూరు జేఎల్ఎం గ్రేడ్-2 బి.రాజేష్ (767187 6938) తదితరులు ఆయా గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో వుంటారని వారిసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏఈ సూచించారు.

భవిష్యత్ తరాలకోసం మొక్కలు నాటాలి

ఉంగుటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : భావితరాల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని చెట్లుగా పెంచే బాధ్యతను తీసుకోవాలని టీన్ మిషన్స్ ఇన్ ఇండియా డైరెక్టర్ పులిపాక సుధాకర్ పిలుపునిచ్చారు. బూట్ క్యాంప్‌లో భాగంగా బుధవారం ఆత్కూరులోని టీన్ మిషన్స్ ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీం లీడర్స్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీన్ మిషన్స్ సెక్రటరీ పి.జీవన్‌కుమార్, మెంబర్ బి.అబ్రహాం పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రాకతో
రోగులకు మంచిరోజులు

- వైసీపీ పాలనలో ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డ రోగులు
- నూతన అభివృద్ధి కమిటీతో సమస్యలకు చెక్
- దాతల సహకారంతో కూర్చోవడానికి షెడ్డు, నిరంతరం విద్యుత్ సరఫరా, తాగునీరు, దుప్పట్లు, ఆహార వసతి



ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రి.. దాతల సాయంతో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్లు.. కూర్చోవడానికి షెడ్డు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలందించే దిశగా ఉయ్యూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ ముందుకు సాగుతుంది. ఉయ్యూరు, పరిసర మండలాల పరిధి 50 గ్రామాలకుపైగా కేంద్రంగా ఉన్న ఉయ్యూరు పట్టణంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ప్రతిరోజు వైద్యం కోసం ప్రజలు వస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో హెల్త్ సెంటర్‌లో కనీస సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడవలసి వచ్చేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం హెల్త్ సెంటర్‌కు చైర్మన్‌గా మండవ జయదేవ్‌తో పాటు డైరెక్టర్లతో కూడిన నూతన అభివృద్ధి కమిటీని నియమించింది. మెరుగైన వైద్యసేవలతో పాటు, కనీస సౌకర్యాలు కల్పించేందుకు చైర్మన్ దృష్టి సారించారు. ఎలక్ట్రికల్ లోడుకు సంబంధించి సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉండగా అందుకు అవసరమైన నిధులు లేకపోవడంతో దాతల సహకారంతో ఇన్వర్టర్లు ఏర్పాటు చేసి వైద్యసేవలకు అంతరాయం కలగకుండా నిరంతరం సేవలందిస్తున్నారు. తాగునీటి కోసంహెల్త్ సెంటర్‌లో 2019వ సంవత్సరానికి ముందు ఏర్పాటు చేసిన పెద్ద ఆర్వో ప్లాంటు పాడైపోగా వేసవిలో తాగునీటి సమస్య రాకుండా వాటర్ ఫిల్టరు, చిన్న ఆర్వోసిస్టం, వాటర్ కూలర్ ఏర్పాటు చేశారు. బెడ్‌లపై రోగులకు అవసరమైన దుప్పట్లు, బెడ్‌షీట్లు, ఆహార వసతి, రోగులు, వారికి తోడుగా వచ్చిన వారు ఆవరణలో కూర్చునేందుకు షెడ్డు నిర్మించారు. ప్రాంగణంలో పెరిగిన పొదలు, పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రతతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కమిటీ రూపొందిస్తోంది.

మెరుగైన సేవలందించేందుకు కృషి

ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు, చికిత్స అందించేందుకు దాతల సహకారంతో అభి వృద్ధి కమిటీ కృషి చేస్తుంది. స్వచ్ఛమైన తాగునీరు, ఇతర వసతులు కల్పిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాం.

- మండవ జయదేవ్, అభివృద్ధి కమిటీ చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పారిశుధ్య సమస్య పరిష్కరించాలి

అధికారులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశం

పెనమలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలో పారిశుధ్య సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం పోరంకి ఎమ్మెల్యే కార్యాలయంలో పారిశుధ్యంపై జరిగిన సమీక్షలో అధికారులతో ఆయన మాట్లాడారు. మునిసిపాలిటీలోని నాలుగు క్లస్టర్లలో ఉన్న 19 సచివాలయాలను మూడు భాగాలు చేసి ఒక్కో భాగానికి ఒక్కో ఈవోఆర్డీని నియమించమని అధికారులను ఆదేశించారు. ఒక్కో సచివాలయానికి ఒక పంచాయతీ కార్యదర్శిని నియమించి వారం రోజుల్లో మునిసిపాలిటీలో పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైందని, మురుగు పారుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపు నీరు రోడ్లమీదికి రాకుండా డ్రైయిన్లు యుద్ధప్రాతిపదికన బాగు చేయాలని ఆదేశించారు. సమావేశంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, మునిసిపల్ కమిషనర్ భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో చోరీ

హనుమాన్‌జంక్షన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇండేన్ గ్యాస్ కార్యాలయం సమీపంలో గూడవల్లి మధుసూదన రావు ఇంట్లో బుధవారం తెల్లవారు జామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. బాధిత కుటుంబం మంగళవారం ఇంటికి తాళం వేసి ఏలూరు వెళ్లారు. బుధవారం ఇంటికి వస్తే తలుపులు తాళాలు పగల కొట్టి బీరువాలో ఉన్న మంగళసూత్రం, వెండి వస్తువులు అపహరించుకుపోయారు.

చరిత్ర తిరగరాసేలా మహానాడు

- 2029 ఎన్నికల్లో గెలుపు మనదే
- టీడీపీలో కష్టపడే వారికే పదవులు
- 2026 నాటికి బందరు పోర్టు పనులు పూర్తి
- ఎంఎస్ఎంఈ పార్కులతో యువతకు ఉపాధి
- మచిలీపట్నం నియోజకవర్గ మినీమహానాడులో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర మహానాడు చరిత్రను తిరగరాసేలా నిర్వహిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సుల్తానగరం గోల్డ్ కన్వెన్షన్ హాలులో బుధవారం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ మినీమహానాడు అట్టహాసంగా జరిగింది. తొలుత పార్టీ జెండాను మాజీ ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఎగురవేశారు. అనంతరం గోల్డ్ కన్వెన్షన్ హాల్‌లో ఎన్టీఆర్ ప్రతిమకు మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ రావు, శాప్ ఛైర్మన్ రవినాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర అధ్యక్షత వహించి మాట్లాడుతూ తెలుగుజాతి ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీ ప్రజలకు సేవలందిస్తుందన్నారు. సంస్థాగత నిర్మాణమే తెలుగుదేశం పార్టీకి పునాది అని 44 ఏళ్లుగా పార్టీని కాపాడుతోంది కార్యకర్త లేనన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా కోటి సభ్యత్వాలతో తెలుగుదేశం పార్టీ సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి ప్రస్తుత ముఖ్యమంత్రి ఒకప్పటి తెలుగుదేశం పార్టీ నేతలేనన్నారు. పార్టీ మొదటి నుంచి బొర్రా వెంకటస్వామి, అంబటి బ్రాహ్మణయ్య, నడకుదిటి నరసింహారావు, వడ్డి రంగారావు ఇలా టీడీపీ నేతల గెలుపునకు కృషి చేసేందుకు సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ ఎంతో కృషి చేశారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ లో 50 డివిజన్లు గెలుపు ఖాయమన్నారు. అలాగే పంచాయతీలన్నీ కూటమి అభ్యర్థులవే నన్నారు. కడపలో ఈనెల 27, 28, 29 తేదీలలో నిర్వహించే మహానాడుకు మచిలీపట్నం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తల తరలివెళ్తారన్నారు. జూన్ 6, 7, 8, తేదీలలో మసులా బీచ్ ఫెస్టివల్ కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామన్నారు. జలజీవన్ మిషన్ తో 200 కోట్లతో విజయవాడ నుంచి తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. 164 కోట్ల తో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడతామన్నారు.


మచిలీపట్నం నియోజకవర్గ మినీమహానాడు సభలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

వైసీపీ అరాచక శక్తులకు శంకరగిరి మాన్యాలే!

- గుడివాడ నియోజకవర్గ మినీ మహానాడులో కొనకళ్ల నారాయణ
- కొడాలి, వంశీపై ఎమ్మెల్యే రాము ఫైర్


గుడివాడ నియోజకవర్గ మినీమహానాడు సభలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల

గుడివాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అధికారమదంతో విర్రవీగిన అరాచకవాదులకు శంకరగిరి మాన్యాలే గతి అని, చేసిన తప్పులకు జైల్లో సేదతీరుతున్నారని ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఆడిటోరియంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడును ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీజెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొనకళ్ల మాట్లాడుతూ టీడీపీ శ్రేణులకు మహానాడు పెద్ద పండుగని, పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని కార్యకర్తల బలం ఒక్క తెలుగుదేశం పార్టీకే సొంతమన్నారు. జగన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అన్ని విధాలుగా విచ్ఛిన్నమై అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి పథంలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర పునఃనిర్మాణంలో కార్యకర్తలు ప్రభుత్వానికి తోడ్పాటునందించాలని కోరారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఇప్పటికే మూడు పథకాలను అమలు చేస్తున్నారని, ఆగష్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ఆచరణలో రానుందని కొనకళ్ల అన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

- పేట పోలీసుల ముమ్మర దర్యాప్తు

జగ్గయ్యపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోదాడ రోడ్డులో చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆచూకీకోసం జగ్గయ్యపేట పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. 3 రోజులుగా ప్రభుత్వాసుపత్రిలో ఆ వ్యక్తి భౌతికకాయాన్ని భద్రపరిచి, బంధువులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారు. అదృశ్యమైన వ్యక్తుల వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ నెల 18న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పట్టణంలో కోదాడ రోడ్డులో ఒక చెట్టు కింద గుర్తించి పోలీసులకు సమాచారం అందగా మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. మృతుడు వయస్సు 40-45 మధ్య ఉంటుందని, ఎరుపు, గ్రే కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, నలుపు రంగు మొలతాడు, ఎడమకాలిపై నల్లతాడు, ఎడమకాలి తొడపై కాలిన మచ్చ ఉందని ఎస్సై జీ.రాజు తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.


యోగా సాధనతో మానసిక ప్రశాంతత

శిక్షణా తరగతులు ప్రారంభించిన జేసీ గీతాంజలి శర్మ



మచిలీపట్నం టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా యోగ శిక్షణా తరగతులు నిర్వహించాలని, యోగ సాధన వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని జెసి జ్యోతి ప్రకాశం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, జూన్ 21 న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి నెల రోజుల పాటు గ్రామ, మండల, నియోజకవర్గస్థాయి యోగ శిక్షణా తరగతులు నిర్వహిస్తారన్నారు. యోగ గురువులు శిక్షణ ఇస్తారన్నారు. జూన్ 21న విశాఖపట్నంలో జరిగే యోగా డే కి ప్రధాని నరేంద్రమోడీ వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 2కోట్ల మందికి తమతమ ప్రాంతాలలో యోగ కార్యక్రమం ప్రదర్శించాలన్నారు. డీఆర్వో చంద్రశేఖర్, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, ఆర్డీవో స్వాతి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి చిననరసింహులు, డీఈవో రామారావు, డీఎస్‌డీవో ఝాన్సీలక్ష్మీ, డీఎస్పీ సిహెచ్ రాజా, ఆర్ఐవో సాల్మన్ రాజు, ఆయుష్‌శాఖ సీనియర్ అధికారి జావేదా ఖాన్, డాక్టర్ భాగ్యలక్ష్మీ, యోగా గురువులు చింతయ్య, గురునాధబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి డీఆర్వో తదితరులు వజ్రాశనం, తాడాశనం, వృక్షాసనం, త్రికోణాసనం, శశాంకాసనం, భుజంగాసనం, శేతుబంధాసనం, వృత్తాన పాదాసనం, పవనముత్తాసనం, కపాలభాతి, నాడీసాధనం, శీతలీ భ్రామరి ప్రాణాయామం చేయించారు. మాస్టర్ ట్రైనింగ్ శిరీష ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.









సుసంపన్న ఆరోగ్యాంధ్ర లక్ష్యం

- 21 నుంచి జూన్ 21 వరకు ఊరూ వాడా యోగాంధ్ర మాసోత్సవాలు
- కనీసం 2కోట్ల మందిని భాగస్వామ్యం చేసేలా ఉత్సవాలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు

విద్యాధరపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): సుసంపన్న, ఆరోగ్య, ఆనందమయ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర విజన్ ఎట్ 2047 సాకారం దిశగా ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార, జనజాగృతి నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం) ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. కృష్ణానదీ తీరాన హరిత బెరంపార్కు - పున్నమీఘాట్‌లో ఎన్టీఆర్ జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ భారతీయ ప్రధాన మంత్రి చొరవ, ఐరాస తీర్మానంతో తొలిసారిగా 2015, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాలు జరిగాయని, ఈ ఏడాది విశాఖలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని రానున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో నెల పాటు ఊరూ వాడా ప్రత్యేక ప్రచారం నిర్వహించనున్నట్టు తెలిపారు. దాదాపు 2కోట్ల మందిని భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

45 నిమిషాల కామన్ యోగా ప్రొటోకాల్

నిపుణులు రూపొందించిన 45 నిమిషాల నిడివి గల కామన్ యోగా ప్రొటోకాల్ ఆధారంగా ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయనున్నామని కృష్ణబాబు తెలిపారు. వారి ద్వారా ప్రతి గ్రామం, వార్డులో ప్రజలకు యోగాభ్యాసనతో శారీరక, మానసిక ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై అవగాహనతో పాటు అభ్యాసన చేయించడం జరుగుతుందన్నారు. ఇందుకు వీలుగా ప్రత్యేక యాప్, పోర్టల్ అందుబాటులో ఉందన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సాకారం దిశగా యోగాంధ్ర ఓ గొప్ప ముందడుగని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బాపూ మ్యూజియం, కొండపల్లి ఖిల్లా, గాంధీ హిల్ వంటి చారిత్రక, పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఆయుష్ డైరెక్టర్ కే దినేష్ కుమార్ మాట్లాడుతూ సీఎం ఆదేశాలకు అనుగుణంగా యోగా విశిష్టతను రాష్ట్రం నలుమూలలా వ్యాప్తి చెందేలా యోగాంధ్ర ప్రచారం నిర్వహించనున్నట్టు మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నేటి ఆధునిక జీవన శైలిలో ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవడం సవాలుగా మారిందని, ఈ నేపథ్యంలో ఒత్తిడిని అధిగమించి రోజువారీ జీవితంలో వెలుగులు నింపుకునేందుకు ప్రతి ఒక్కరూ రోజూ కనీసం అరగంట యోగాభ్యాసాలు, ధ్యానం చేయాలని సూచించారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ రామ త్లేహి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

25న ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- 10,381 మంది అభ్యర్థులకు 25 కేంద్రాల ఏర్పాటు: ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీపీఎస్సీ) ఈనెల 25న దేశవ్యాప్తంగా సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో యూపీపీఎస్సీ ప్రిలిమ్స్ నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 25 కేంద్రాల్లో 10,381 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేయాలని, ఆహ్లాదక రమైన వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష రాసేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈనెల 25న ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరుగనుందన్నారు. లోకల్ ఇన్‌స్పెక్టింగ్ కమ్ లైజన్ ఆఫీసర్, రూట్ అధికారులు, సూపర్‌వైజర్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రతా సిబ్బందిని నియమించినట్టు వెల్లడించారు. రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ఏపీఎస్ ఆర్టీసీ, మున్సిపల్ శాఖల అధికారుల సమన్వయంతో పరీక్షను విజయవంతంగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ సలీమ్, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, లైజనింగ్ అధికారులు, సహాయ లైజనింగ్ అధికారులు, వెన్యూ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఉచితంగా పండ్ల తోటల పెంపకం

ఉపాధి హామీ పథకం ఆసరాతో ఉచితంగా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టవచ్చని, దీనిపై రైతులకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకొనేలా ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంతో పాటు పశుగ్రాసం పెంపకానికి సంబంధించిన సమాచారంతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాతలను ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా ఉద్యాన పంటల సాగు చేపట్టేలా చేయిపట్టి నడిపించాలన్నారు. మామిడి, జామ, నిమ్మ, సపోట, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, కొబ్బరి, ఆయిల్‌పామ్, యాపిల్ బేర్, మునగ, మల్లి, గులాబి తోటల పెంపకానికి సన్న - చిన్న కారు రైతులు (ఐదెకరాల లోపు) అర్హులన్నారు. ఉదాహరణకు మామిడికి ఎకరానికి వివిధ రూపాల్లో రూ.1,09,950 సాయమందుతుందన్నారు. జామకు రూ.1,46,971, ఎకరంలో 1,600 మల్లెమొక్కల పెంపకానికి దాదాపు రూ.1,85,396 సహాయం అందించడం జరుగుతుందన్నారు. పశువులు కలిగిన సొంత భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టవచ్చని, 0.50 ఎకరాలో పశుగ్రాసం పెంపకానికి రూ.32,992 ఖర్చవుతుందని అంచనా. వివిధ పనులకు ఈ మొత్తం మెటీరియల్ లేదా వేజ్ కాంపొనెంట్‌గా అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, వితంతు, విభిన్న ప్రతిభావంతులైన రైతులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, 10 నుంచి 50 సెంట్ల వరకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. ఈ ప్రయోజనాలను పొందేందుకు ఎంపీడీవో లేదా ఉపాధి హామీ ఏపీవో లేదా గ్రామ సచివాలయ ఉద్యాన అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. డ్వామా పీడీ ఎ.రాము, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, ఏడీఏ అనిత, డ్వామా జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ కె.ఉష తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే
అగ్ని ప్రమాదాల నివారణ

- ఏపీ విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్

వన్‌టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎక్కువగా జరిగే అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు భాగస్వామ్యం కావాలని ఏపీ విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ పిలుపు నిచ్చారు. అగ్నిమాపక సేవలు, విపత్తు స్పందన రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్ద పెద్ద నగరాల్లోని ఓల్డ్ సిటీలుగా పేర్కొనే ప్రాంతాల్లో అనుకోని అగ్ని ప్రమాదం సంభవించే పరిస్థితులు అధికంగా ఉంటాయన్నారు. రహదారులు ఇరుకుగా ఉండటం, షాపులు, ఆపై అంతస్తుల్లో నివాసాలుండటం, ఇలా అనేక కారణాలు ఇబ్బందికరంగా మారతాయన్నారు. తాజాగా హైదరాబాద్ చార్మినార్ వద్ద జరిగిన అగ్నిప్రమాదాన్ని మృతుల సంఖ్య అధికంగా ఉండటాన్ని ఆయన ప్రస్తావిస్తూ ఎన్నో లోపాలున్నాయని తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి పెద్ద పట్టణాలలో సరైన జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మాణాలు చేయటం వల్ల అగ్ని ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. శ్రీకాకుళంలో షాపింగ్ మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో అగ్నిమాపక సిబ్బంది లోపలకు వెళ్లటానికి 6 గంటలు పట్టిందన్నారు. లోపలున్న దుస్తులు కాలటంతో అధిక పొగ కమ్మేసిందని, చాలా మంది ఊపిరి ఆడక ఇబ్బంది పడ్డారన్నారు. ఈ పరిస్థితి ఇతర ప్రాంత భవనాల్లో కూడా సంభవించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అపార్టుమెంట్‌కు ఎన్‌వోసీ ఇచ్చే సమయంలోనే ఏర్పాట్లను పరిశీలిస్తామన్నారు. డైరెక్టర్ డి.మురళీ మోహన్, అదనపు డైరెక్టర్ టి.ఉదయకుమార్, అసిస్టెంట్ డ్రిస్టిక్ట్ ఫైర్ ఆఫీసర్ కె.వినయ్, పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు శనివారంలోపు దరఖాస్తు చేసుకోవాలి

భారతీనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పొందటానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం కనకారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో శనివారంలోపు దరఖాస్తులను పూర్తి చేసుకోవాలన్నారు. 8తి, 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 94906 39639 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


పిడుగు పాటుకు గురైన జామియా మసీదు

జామియా మసీదుపై పిడుగుపాటు

- స్వల్పంగా ధ్వంసమైన మీనార్

జగ్గయ్యపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం కురిసింది. పట్టణ పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. పేట నడిబొడ్డున రాజీవ్ చౌక్‌లోని జామియా మసీదుపై పిడుగుపడి మీనార్‌కు ఉన్న చంద్రవంకపై పడి స్వల్పంగా బీటలు వారింది. భారీ శబ్దం రావటంతో ఆ ప్రాంత వాసులు ఉలిక్కిపడ్డారు.

వాణిజ్య ప్రాంతం కావటంతో కొద్దినష్టంతోనే ప్రమాదం తప్పిపోవటంతో ఆ ప్రాంత వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

అదనపుకట్నం కోసం భార్య హత్య

- ఆపై రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ
- భర్తకు యావజ్జీవ శిక్ష విధించిన కోర్టు
- నిందితుడిది పెనుగంచిప్రోలు

జగ్గయ్యపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): వరకట్నం కోసం భార్యను వేధించటమే కాకుండా, హత్య చేసిన సంఘటనలో పెనుగంచిప్రోలుకు చెందిన వ్యక్తికి కోర్టు మంగళవారం యావజ్జీవ శిక్ష విధించింది. జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం 2016 ఏప్రిల్‌లో సర్కిల్ పరిధిలో పెనుగంచిప్రోలుకు చెందిన జిడుగు రాణిని భర్త వెంకటనారాయణతో పెద్దల కుదిర్చిన వివాహం జరిగింది. వివాహానంతరం భర్త వెంకట నారాయణ వేరే మహిళతో ఫోన్‌లో మాట్లాడుతుండటంతో పాటు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని తండ్రి దేవరకొండ బ్రహ్మంకు తెలియజేయగా పలుసార్లు సర్దిచెప్పి సరిగా చూసుకోవాలని అల్లుడు, కుటుంబసభ్యులకు చెప్పారు. తర్వాత 2 నెలలకు వెంకటనారాయణ తండ్రి శ్రీనివాసరావు బ్రహ్మంకి ఫోన్ చేసి బంధువుల ఇంటికి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు చెప్పాడు. జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి వచ్చి కుమార్తె రాణిని మృతదేహాన్ని చూసి గొంతు మీద నులిమినట్టు గుర్తులు, కుడి ముక్కురంధ్రం నుంచి రక్తస్రావమైనట్టు గుర్తులు, కుడి తొడపై గీసుకుపోయిన దెబ్బలు ఉండటంతో హత్యని జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ వైవీఎల్ నాయుడు హత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాస్యిక్యూషన్ వెంకటనారాయణ రాణిని హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడని తగు సాక్ష్యాధారాలతో నిరూపించటంతో నందిగామ 16వ అదనపు కోర్టు హత్య చేసినందుకు జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా, వరకట్నం కోసం వేధించినందుకు 3ఏళ్ల జైలు, రూ.5వేల జరిమానా, తప్పుడు సమాచారం ఇచ్చినందుకు, సాక్ష్యాలను అదృశ్యం చేసేందుకు యత్నించినందుకు సెక్షన్ 201 కింద 3ఏళ్ల జైలు, రూ.5వేలు జరిమానా విధించిందని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

అన్నదాత సుఖీభవ విధివిధానాలు ప్రకటించాలి

- ఏపీ కౌలు రైతు సంఘం

గవర్నర్‌పేట, మే 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు విధివిధానాలు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంత్రివర్గ సమావేశంలో అన్నదాత సుఖీభవపై స్పష్టమైన ప్రకటన ప్రభుత్వం నుంచి రాలేదని, కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తేనే పథకం ఇవ్వనున్నట్టు ప్రచారం జరుగుతోందన్నారు. కేంద్రం మూడు విడతలుగా భూమి కలిగిన రైతులకు రూ. 6 వేలు చొప్పున జమ చేస్తోందని, కౌలు రైతులకు పథకం వర్తింపజేయడం లేదని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు వర్తింపజేసేలా ప్రభుత్వ విధివిధానాలు ఉండాలని, వ్యవసాయ సీజన్ ప్రారంభమౌతున్న తరుణంలో వ్యవసాయ పెట్టుబడుల కోసం రూ. 20 వేలు ఒకేసారి రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించాలని, గుర్తించిన ప్రతి కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని కోరారు.

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

పాడిరైతుల సంక్షేమమే ధ్యేయం



బంటుమిల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల సంక్షేమమే కూటమి ధ్యేయమని డీసీ చైర్మన్ బొర్రా కాశీ పేర్కొన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు అర్తమూరులో పాడి రైతులందరికీ 50శాతం రాయితీతో బలవర్ధకమైన దాణాను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కాగిత బాలాజీ, ఎస్సీసెల్ అధ్యక్షులు భూపతి రమేష్, నీటి సంఘం అధ్యక్షులు కాగిత రవి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర



కృత్తివెన్ను, మే 21(ఆంధ్రజ్యోతి) : కొమాళ్లపూడిలో పోలేరమ్మ జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకలు నిర్వహించారు. గ్రామ పెద్దలు కాగితకు ఘనంగా స్వాగతం పలికి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు, మాజీ ఎమ్‌పిపి వలవల సత్యన్నారాయణ, కూనసాని చిన్న, ప్రత్తిపాటి రామాంజనేయులు, వలవల తాతాజీ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి



ఘంటసాల, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని డిప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం అచ్చెంపాలెంలో తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించి గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించి గ్రామపంచాయతీ వారికి సహకరించాలని కోరారు. అనంతరం సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు

ప్రత్యేక బస్సు సర్వీసు 24న

అవనిగడ్డ, మే 21 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి సరస్వతీ పుష్కరాలకు ఈ నెల 24వ తేదీ శనివారం సాయంత్రం 8 గంటలకు ప్రత్యేక సర్వీసును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న సరస్వతి నది పుష్కరాలకు ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ దివిసీమ, రేపల్లె , పరిసర ప్రాంత భక్తులకు సువర్ణ అవకాశం కల్పించిందన్నారు. సరస్వతీ నది పుష్కర స్నానం ఆచరించి కాలేశ్వరుని దర్శనం, అనంతరం రామప్ప దేవాలయం, వరంగల్ నగరంలోని వెయ్యి స్తంభాల గుడి, భద్రకాళి దేవాలయం సందర్శించుకుని 26న ఉదయం అవనిగడ్డ వచ్చే విధంగా ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గల భక్తులు వెంటనే రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 9959225466, 7036335079కు సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

చల్లపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఆముదార్లంక కృష్ణానదీతీరంలో ఇసుక అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. ఇసుక అక్రమ రవాణా సమాచారం అందుకున్న చల్లపల్లి ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం పోలీసు సిబ్బంది, డీఎస్పీ టీమ్‌తో కలిసి రేవులో దాడులు నిర్వహించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను అడ్డుకుని చల్లపల్లి తరలించారు. అక్రమ రవాణా చేస్తున్నవారిపై కేసులు నమోదుచేసి ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు చల్లపల్లి ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

కోలాటం చిన్నారుల గజ్జె పూజ



చల్లపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి నారాయణరావు నగర్‌లోని ప్రసన్న భక్తాంజనేయ స్వామి దేవస్థానం వద్ద మురళీ కోలాటం భక్తబృందం చిన్నారులు బుధవారం గజ్జె పూజ నిర్వహించారు. హనుమజ్జయంతి సందర్భంగా తొలి కోలాట ప్రదర్శన ఇచ్చేందుకుగాను ఆలయంలో గజ్జె పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అడపా సాయిబాబు, నర్రా చిన్ని, మిరియాల సుబ్బారావు, నంద్యాల పండు, శ్రీనివాసరావు, రెడ్డి, లంకె శ్రీనివాసరావు, కోళ్ల నాగేశ్వరరావు, సోమిశెట్టి విజయలక్ష్మి, బాపయ్యనాయుడు, పరిశె శ్రీనివాసరావు, విష్ణు భాస్కరరావు, అర్చకులు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కొల్లూరి చిన్నాకు అవార్డు

పెడన, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య ప్రముఖుడు, పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొల్లూరి చిన్నా కొణిజేటి రోశయ్య మెమోరియల్ జాతీయ అవార్డు అందుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా తన సొంత నిధులు వెచ్చించి నిరుపేదలు, నిర్భాగ్యులకు సేవలందిస్తున్న చిన్నాను విశాఖపట్నంలోని దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ కళాపరిషత్‌లు ఈ అవార్డుకు ఎంపిక చేశాయి. విశాఖజిల్లా పౌర గ్రంథాలయంలో మంగళవారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ కళాపరిషత్‌ల నిర్వాహకుల చేతుల మీదుగా చిన్నా ఈ అవార్డు అందుకున్నారు.



నాణ్యమైన భోజనం అందించాలి

మంత్రి కొల్లు రవీంద్ర



మూడు స్తంభాల సెంటర్‌లో అన్న క్యాంటీన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : పేదలకు తక్కువ ధరలో అందుబాటులో ఉండే విధంగా రూపొందించిన నాణ్యత గల భోజనం అందించాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం అన్న క్యాంటీన్ అభివృద్ధి కార్యక్రమాల పనులకు మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, శాప్ చైర్మన్ రవి నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ కార్పొరేటర్‌లు చిత్రజల్లు నాగరాము, మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్, టీడీపీ నాయకులు మరకాని పరబ్రహ్మం, గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిగూడెంలో
ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

మచిలీపట్నం నగరంలోని కుమ్మరిగూడెంలో బుధవారం ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాప్‌చైర్మన్ రవినాయుడు, టీడీపీ నాయకులు మోటమర్రి బాబాప్రసాద్, గోపు సత్యనారాయణ, మరకాని పరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ కల్పించాలి

సచివాలయాల్లో పనిచేసే వార్డు విద్య డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులను టెక్నికల్ పోస్టుగా గుర్తించి టెక్నికల్ కేడర్ ప్రమోషన్ ఛానల్ కల్పించాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రకు బుధవారం విద్య, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు ప్రసాద్ తదితరులు వినతి పత్రం అందజేశారు. సచివాలయాల్లో పనిచేస్తున్న డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులను ప్రభుత్వ శాఖ కార్యాలయాల్లో టెక్నికల్ , ఐటీ సహాయకులుగా నియమించాలన్నారు. స్కూల్, టెక్నికల్, హయ్యర్ ఎడ్యుకేషన్ శాఖలలో సాంకేతిక సిబ్బందిగా నియమించాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ఇవ్వాలని కోరారు.



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కేయూ ఉపకులపతి రాంజీ

మచిలీపట్నం టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగసాధన చేయాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె. రాంజీ అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో బుధవారం నుంచి నెల రోజుల పాటు విద్యార్థులు, అధ్యాపకులకు యోగ శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపకులపతి రాంజీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు విశ్వవిద్యాలయంలో యోగా మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్. ఉష, యోగా గురువు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ ఆదేశాలు ఖచ్చితంగా అమలు చేయాలి

విశ్వవిద్యాలయం నుంచి అనుబంధ కళాశాలలకు వచ్చే ఆదేశాలను వెంటనే అమల్జేయాలని ఉపకులపతి రాంజీ అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్వచ్ఛ ఆంధ్ర, యోగాంధ్ర కార్యక్రమాలతో పాటు అకడమిక్ క్యాలెండర్ అమలుపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్. ఉష, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ దిలీప్ తదితరులు మాట్లాడారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణకుమారి, చిత్రంలో ఎంపీపీ వాణి

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎంపీడీవో అరుణకుమారి

పెడన రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ విధానాలు క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలయ్యేలా అధికారులు పనిచేయాలని ఎంపీడీవో అరుణకుమారి అన్నారు. మండల కార్యాలయంలో ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి ఆవరణలో రెండు గుంటలు తీసి, తడి పొడి చెత్తను వేర్వేరుగా నిల్వచేసే పద్ధతిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఎంఈవో హరనాద్‌బాబు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా విధానానికి దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన కొనసాగుతుందన్నారు. జడ్పీటీసీ అర్జా నగేష్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు యాదంరెడ్డి వరప్రసాద్, ఎంపీటీసీలు బొల్లా ఉదయ్ నాగ కుమార్, ఎ నరశింహరావు, బి గురునాథం, సర్పంచులు దావు భైరవలింగం, గుడిశేవ శ్రీనివాసరావు. ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు పాల్గొన్నారు.



మినీమహానాడులో మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణ

ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు

మచిలీపట్నం టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సుపాస్ అవకాశం కల్పిస్తామన్నారు. శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తూ మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య మాట్లాడుతూ, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచేనాని, నగర టీడీపీ అధ్యక్షుడు ఎండి ఇలియాస్‌పాషా, కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, గొర్రెపాటి గోపీచంద్, లంకే హరికృష్ణ, పివి ఫణికుమార్, కోస్తా మురళీకృష్ణ, తలారి సోమశేఖర్, పరిశీలకుడు లుక్కా సాయిరాంగౌడ్, కొనకళ్ళ బుల్లయ్య, ఎండి ఖాజా, బచ్చుల బోసుబాబు, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు హసీంబేగ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో రత్నకోడుకు మోక్షం



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న పీసీ చైర్మన్

కోడూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషితో రత్నకోడు మేజర్ డ్రెయినేజీ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. లింగారెడ్డిపాలెంలో స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్స్ - ఎస్‌డిఎంఎఫ్ నిధులు రూ.64 లక్షలతో లింగారెడ్డిపాలెం నుంచి అశ్వారావుపాలెం వరకు ఆరు కిలోమీటర్లు పొడవునా రత్నకోడు మేజర్ డ్రెనేజీలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులను బుధవారం చేపట్టారు. ఈ పనులను ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు వాహన పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్, డ్రెయినేజీ శాఖ డీఈఈ జె.బాబు నాయక్, ఏఈఈ అబ్దుల్ కరీం, గ్రామ ప్రముఖులు యర్రంశెట్టి దామోదర్, రైతులు పాల్గొన్నారు.



నాంచారమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠ

మోపిదేవి, మే 21 (ఆంధ్రజ్యోతి): పెదకళ్లేపల్లిలో వేంచేసి ఉన్న అద్దంకి నాంచారమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఉదయం వైభవంగా జరిగింది. వేద పండితులు గౌరీ శంకర్ కుమార్ నేతృత్వంలో 11 మంది ఋత్వికుల బృందం అమ్మవారి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహోత్సవంలో భాగంగా గణపతి పూజ, సుముహూర్తాన యంత్ర స్థాపన, శిఖర ప్రతిష్ఠ, పోతురాజు స్వామి సింహవాహనముల ప్రతిష్ఠ నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

జాతీయస్థాయి వేడుకగా
మసులా ఫెస్టివల్ : శాప్ చైర్మన్



మచిలీపట్నం టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో జూన్ నెల మొదటి వారంలో నిర్వహించే మసులా ఫెస్టివల్ జాతీయస్థాయి వేడుకగా నిర్వహిద్దామని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవినాయుడు పిలుపునిచ్చారు. బుధవారం మంగినపూడి బీచ్‌ని ఆయన సందర్శించారు. బీచ్‌లో నిర్వహించే ఏర్పాట్లపై మెప్మా పీడీ సాయిబాబు, ఆర్ట్ డిజైనర్ వంకా రమణ, స్పోర్ట్స్ ఆఫీసర్ ఝాన్సీలక్ష్మీ, తహసీల్దార్ హరినాథ్‌తో చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా పిడి సాయిబాబు, డీఎస్‌డీవో ఝాన్సీలక్ష్మీ, విజయవాడ క్రీడల అధికారి కోటేశ్వరరావు, తహసీల్దార్ హరినాథ్, జల క్రీడల జిల్లా అధ్యక్షుడు దావులూరి సురేంద్రబాబు, ఫిలిం ఆర్ట్ డిజైనర్ వంకా రమణ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతి
రాజ్యాధికారంతోనే సాధ్యం

చల్లపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాలు అభివృద్ధి పథంలో నడవాలంటే రాజ్యాధికారం ఒక్కటే మార్గమని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ అన్నారు. చల్లపల్లి షాదీఖానాలో బహుజన సంకల్ప సభ నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు అధ్యతన నిర్వహించిన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుష్పరాజ్ మాట్లాడుతూ, 75 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో అణగారినవర్గాల గృహాలు నేటికీ ఊరి బయటే ఉంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీంద్ర, దొండపాటి శామ్యూల్, బోసుబాబు, వెంకటేశ్వరరావు, మరియబాబు, బాలాజీ, బీఎస్పీ కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు. పూలే, అంబేద్కర్, కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

టీడీపీ నగర అధ్యక్షుడిగా లోగిశెట్టి

మచిలీపట్నం టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : గోల్డ్ కన్వెన్షన్ హాలులో బుధవారం జరిగిన మినీమహానాడులో మచిలీపట్నం నగర టీడీపీ అధ్యక్షుడిగా మాజీ కౌన్సిలర్ లోగిశెట్టి వెంకటస్వామి ఎన్నికయ్యారు. నగర టీడీపీ ప్రధాన కార్యదర్శిగా బచ్చుల అనీల్‌కుమార్ ఎన్నికయ్యారు. బందరు రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడిగా మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు ఎన్నికకాగా, ప్రధాన కార్యదర్శిగా పోతేపల్లికి చెందిన కాటం మధు ఎన్నికయ్యారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



చల్లపల్లిలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత మీర్ రిజ్వాన్

చల్లపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : కీర్తిశేషులు భారత ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని బుధవారం చల్లపల్లిలో ఘనంగా నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నేత మీర్ రిజ్వాన్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు కొండేటి భాస్కరరావు, జగ్గవరపు బాబూరావు, యన్నం గంగాధరరావు, తలకోటి సాల్మన్‌రాజు, మహమ్మద్ అన్సారి, చోడాబత్తిన ఆదినారాయణ, మహమ్మద్ అన్వర్‌భాషు, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ : భారతరత్న కీర్తిశేషులు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. వంతెన సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షుడు నరహరశెట్టి శ్రీమన్నారాయణ పూలమల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సాంకేతిక విప్లవానికి పునాదులు వేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ అన్నారు. నియోజకవర్గ ఇంచార్జ్ అందె శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అందె లెనిన్, ఆంజనేయ వర్మ, కాగితాల సుదర్శన్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. అవనిగడ్డ మెయిన్ రోడ్డు సెంటర్‌లో రాజీవ్ గాంధీ విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు శ్రీమన్నారాయణ, అందె లెనిన్, లంకె ఆంజనేయులు వర్మ, కాగితాల సుదర్శన్, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కె.గౌస్ పాల్గొన్నారు.

నాగాయలంక : మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నాగాయలంకలోని కాంగ్రెస్ నేతలు ఎవ్వరూ పట్టించుకోకపోవటం విస్మయం కలిగిస్తోంది. నాగాయలంక సెంటర్‌లో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టి జయంతులకు, వర్ధంతులు నిర్వహించే వారు.

ప్రజా సమస్యలను గాలికొదిలేసిన
కూటమి ప్రభుత్వం : మల్లాది

అవనిగడ్డ, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. బుధవారం అవనిగడ్డలోని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు స్వగృహంలో మీడియాతో ఆయన మాట్లాడారు. కృష్ణా జిల్లాలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసే వారే లేరన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం బస్తా ధాన్యాన్ని కల్లాల్లోనే రూ.2200లకు కొనుగోలు చేస్తే నేడు కూటమి ప్రభుత్వంలో రూ.1600లకు కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, చట్టాలను, రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం చేతుల్లోకి తీసుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్నారు. తిరువూరులో మొత్తం 20 కార్పొరేటర్లకు వైసీపీ 17, టీడీపీ 3 ఉండగా, వైసీపీ నాయకులు, కార్పొరేటర్లను కూటమి నాయకులు బెదిరించి అడ్డుకుంటున్న తీరు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైసీపీ నాయకులు రాజనాల మాణిక్యాలరావు, గరికపాటి కృష్ణారావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

హనుమజ్జయంతికి ఆలయాలు ముస్తాబు

కూచిపూడి, మే 21 (ఆంధ్రజ్యోతి): గురువారం నిర్వహించనున్న హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. కారకంపాడు, అయ్యంకి, యద్దనపూడి అడ్డరోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద చలువ పందిళ్లు వేసి జయంతి వేడుకలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. హనుమజ్జయంతి సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, తమలపాకుల పూజ, స్వామి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.



ముస్తాబైన ఆంజనేయస్వామి ఆలయం

గుడివాడ అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మే 21 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఆడిటోరియంలో ఎమ్మెల్యే వెనిగండ్ల అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడును ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీజెండాను ఆవిష్కరించారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పటిష్టతకు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ నెల 27,28,29 తేదీల్లో కడపలో జరుగు జాతీయ మహానాడు బహిరంగ సభకు గుడివాడ నియోజకవర్గం నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారంజక పాలన జరుగుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తోందన్నారు. సభా వేదికగా పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. మహానాడులో చిన్నారులు నిర్వహించిన కూచిపూడి, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నియోజకవర్గ పరిశీలకురాలు నూకాలమ్మ, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, పార్టీ పట్టణ, రూరల్, నందివాడ అధ్యక్షులు రాంబాబు, మురళీ, సన్యాసిరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సునీల్, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ శాయన పుష్పావతి, నాయకులు ప్రసాద్, జగన్మోహనరావు, రవి పాల్గొన్నారు

గుడివాడలో రైల్వే గేటుల సమస్య శాశ్వత పరిష్కారానికి, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి కృషితో 8 రైల్వే ప్రాజెక్టులకు రూ.400కోట్లు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, రైల్వే, నేషనల్ హైవే,రెవెన్యూ శాఖల అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలు, స్థానిక సానుకూలతలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గంలో 8 రైల్వే గేట్‌ల వద్ద రైల్వే గతిశక్తి పథకంలో భాగంగా రూ.400కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ పాస్‌ల నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులు త్వరితగతిన కార్యరూపం దాల్చేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల సూచించారు. రైల్వే గేట్‌ల వద్ద ఆర్‌వోబీ, అండర్‌పాస్‌ల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ, తదితర ఇబ్బందులను రెవెన్యూ, ఎన్‌హెచ్‌ఐ అధికారులు గూగుల్ మ్యాప్ ద్వారా వివరించారు. గేట్‌ల వద్ద ఆర్‌వోబీ, అండర్‌పాస్ నిర్మాణాలకున్న అనుకూలతలను, రైల్వేలోని వివిధ శాఖల అధికారుల ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పరిశీలన తదితర అంశాలను రైల్వే శాఖ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శ్రీనివాసరావు తెలిపారు.



రైల్వే ప్రాజెక్టుల నిర్మాణ మ్యాప్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, తదితరులు



టిడ్కో కాలనీలో పేరుకుపోయిన చెత్తను చూపుతున్న ఆర్‌సీపీ రెడ్డి

టిడ్కో కాలనీలో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి

గుడివాడ, మే 21 (ఆంధ్రజ్యోతి) : మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో రహదారుల వెంబడి చెత్త పేరుకుపోయి తీవ్ర దర్గంధం వెదజల్లుతుందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి ఆరోపించారు. బుధవారం టిడ్కోకాలనీలో ఆయన పర్యటించి రహదారుల వెంబడి చెత్త దుస్థితి పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీల మురుగునీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తితో రోగాలు ప్రబలే ప్రమాదముందన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే రెండు రోజులకొకసారి 20మంది సిబ్బందిని పంపి పారిశుధ్య పనులు చేపట్టారన్నారు. అయినా కాలనీలో ఎటువంటి మార్పురాలేదన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, డ్రెయినేజీల శుభ్రపరచాలని ఆయన డిమాండ్ చేశారు.



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న ఏవో ఆంజనేయులు

పచ్చిరొట్ట ఎరువులతో సాగు సుభిక్షం

పెదపారుపూడి, మే 21 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట ఎరువులతో సాగు సుభిక్షమని మండల వ్యవసాయశాఖ అధికారి ఆంజనేయులు అన్నారు. బుధవారం పెదపారుపూడి, యలమర్రు, వెంట్రప్రగడ రైతు సేవా కేంద్రాల్లోనూ రైతులకు జీలుగు విత్తనాలు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. మండలంలో రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని వెళ్లి వీఏఏలను సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు జె.అజయ్ బాబు, ఎస్.రత్నజ్యోతి, రైతులు కూచిపూడి సుబ్బయ్య, కె.రామచంద్రరావు, గోరిపర్తి శ్రీను, నగుళ్ల ధనుంజయరావు, మాయల విజయబాబు, షేక్ అబ్దుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

●ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్

గుడివాడ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ఎక్కువగా కురుస్తుండటంతో పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కార్యదర్శులను ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ అంశాలపై ఎంపీడీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైతే పంచాయతీల్లో స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేయాలన్నారు. పారిశుధ్యం విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం వస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బందితో పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో బ్లీచింగ్ చల్లటం, ఇంటింటికి ఆరోగ్యంపై అవగాహన కల్పించటం తదితర అంశాలు పరిశీలించాలన్నారు. తాగునీటి పైపులు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. మురుగు నీరు ఎక్కడైనా వస్తుందని ప్రజలకు ఫిర్యాదు చేస్తే కార్యదర్శులు వెంటనే స్పందించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతిరోజూ డంపింగ్ యార్డులకు చెత్తను తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్ డీ ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణు ప్రసాద్

రోడ్డుపై మురుగు కాలువలోకి వెళ్లేదెలా.!

తోట్లవల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : చిన్న వర్షం కురిసినా తోట్లవల్లూరు సెంటర్లో ప్రజలను మురుగు సమస్య ఇబ్బంది పెడుతోంది. మెయిన్ సెంటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు వర్షపు మురుగు రోడ్డుపై నిలబడటంతో రోడ్డు దెబ్బతిని చెరువులా దర్శనమిస్తోంది. రోడ్డుపై వర్షం మురుగు ప్రక్కన డ్రెయినేజీలోకి వెళ్లే మార్గం లేకుండా పోయింది. రోడ్డు మార్జిన్‌పై వరకు దుకాణదారులు బుసక మెరక తోలటంతో మురుగు డ్రెయినేజీలోకి వెళ్లడంలేదని ప్రజలు చెబుతున్నారు. దీంతో మురుగు రోడ్డుపై నిలిచి ప్రజలకు అసౌకర్యం కలిగించటంతో పాటు రోడ్డు దెబ్బతిని చెరువులా మారింది. ద్విచక్ర వాహనాలు, ప్రజలు ఈ మురుగునీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. పెద్ద వాహనాలు వేగంగా వెళుతుండటంతో మురుగునీరు చింది పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాత్రి వేళల్లో ఏదీ రహదారో, ఏది గోతో తెలియక రోడ్డు ప్రమాదాల బారీన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు లేదా పంచాయితీ అధికారులు స్పందించి రోడ్డు ప్రక్కన బుసక మెరకను తొలగించి మురుగు డ్రెయినేజీలోకి వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు మధ్య గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

నందివాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ నాయకుడు గొంగళ్లమూడికి చెందిన కోగంటి సుభాష్ చంద్రబోస్ (80) బుధవారం ఆయన స్వగృహంలో అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గొంగళ్లమూడి తన స్వగృహంలో సుభాష్ చంద్రబోస్ కుటుంబసభ్యులను పరామర్శించి వారికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. రావితోపాటు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పరామర్శించిన వారిలో ఉన్నారు



కోగంటి సుభాష్‌చంద్రబోస్



బ్రిడ్జి పిల్లర్‌ను ఢీకొనడంతో ధ్వంసమైన లారీక్యాబిన్

బ్రిడ్జి పిల్లర్ ఢీకొట్టిన లారీ

గుడివాడ, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి ప్రమాదసూచికలు లేకపోవడంతో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పిల్లర్‌ను ఢీకొట్టి లారీ ఎదుట భాగం తుక్కుతుక్కైంది. బొమ్ములూరు నుంచి వచ్చేటప్పుడు బ్రిడ్జి నిర్మాణ ప్రథమ పిల్లర్ కిందకు ఉండటం, రహదారి వెడల్పు లేకపోవడంతో ఇరుకుగా ఉన్న రహదారిలో పిల్లర్‌కు ఢీకొట్టడంతో లారీ క్యాబిన్ తుక్కైంది. ముఖ్యంగా రహదారి ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరైన సూచిక బోర్డును కూడా ఏర్పాటు చేయకుండా కాంట్రాక్టర్ తాత్సర్యం చేయడం పట్ల వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 15రోజుల వ్యవధిలో ఇది రెండో ప్రమాదం కావడం గమనార్హం.

మినీ మహానాడుకు భారీగా తరలిన తెలుగు తమ్ముళ్లు

నందివాడ: గుడివాడ వీకెఆర్ వీఎన్‌బీ కాలేజీలో మినీ మహానాడుకు నందివాడ నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్లినట్టు గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి తెలిపారు. వెనిగండ్ల పిలుపు మేరకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి తెలుగు తమ్ముళ్లు మినీ మహానాడుకు తరలివచ్చినట్టు రవి తెలిపారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



పూజలు చేస్తున్న వేదపండితులు

పామర్రు, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయ ప్రాంగణంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని అగ్నిప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఆలయ నిర్మాణ వ్యవస్థాపకుడు తాడిశెట్టి పూర్ణయ్యనాగేశ్వరరావు వంశీయుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ వేదపండితులు చలమచర్ల మురళి కృష్ణామాచార్యుల శిష్యబృందం వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. తొలిరోజు మహాగణపతిపూజ, యాగ సంకల్పం, రక్షాబంధనం, వాస్తుహోమం, అఖండ, దీపస్థాపన అంకురార్పణలతో నిర్వహించారు. అనంతరం అయప్పస్వామి భక్తులు ఆలపించిన స్వామివార్ల భక్తిగీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో వందలాదిమంది అయప్పభక్తులతోపాటు వల్లూరిపల్లి చక్రవర్తి గురుస్వామి, మాగంటి నాని గురుస్వామి, గ్రామ ఉపసర్పంచ్ దేవిరెడ్డి బాలవేంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారించేందుకు చర్యలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కూచిపూడి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఏడాది నుంచి కంటిమీద కునుకు లేకుండా చేస్తూ గ్రామస్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్న కోతుల నుంచి రక్షణ కల్పించేందుకు ఎట్టకేలకు చినముత్తేవి గ్రామ పంచాయతీ అధికారులు కొండముచ్చును రంగంలోకి దింపారు. కోతుల బెడద నివారించాలంటూ ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించటంతోపాటు గ్రామస్థులు ధర్నాకు దిగారు. దీనిపై స్పందించిన అధికారులు కొండముచ్చును తీసుకొచ్చారు. ఓ వ్యక్తి కొండముచ్చును గ్రామం మొత్తం తిప్పుతూ కోతులు గుంపులు గుంపులుగా సంచరించే ప్రదేశాల్లోనూ, నివాస ప్రాంతాల మధ్య, పండ్ల తోటలు, కూరగాయల తోటలు నాశనం చేస్తున్న ప్రదేశాల్లోనూ కొండముచ్చును తిప్పటం ప్రారంభించారు. కొండముచ్చును చూడగానే కోతులు పరుగులు తీయటం ప్రారంభించాయి. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. కోతులు శాశ్వతంగా గ్రామం నుంచి వెళ్లేందుకు గ్రామపంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కొండముచ్చును గ్రామంలో తిప్పుతున్న వ్యక్తి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



శిక్షణ ఇస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు కృష్ణ

పామర్రు, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని పామర్రు గ్రంథాలయాధికారి ఎం. ఝాన్సీరాణి పేర్కొన్నారు. విద్యార్థులకు గ్రంథాలయాలు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల్లో భాగంగా బుధవారం చిన్నారులు దేశభక్తి గీతాలు పట్ల అవగాహన కల్పించారు. సమాజంలో విద్యకు ఉన్న ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ఇదే విధంగా జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో చిన్నారులకు కంప్యూటర్ శిక్షణపై అవగాహన కల్పించారు. ప్రపంచ పరిజ్ఞానాన్ని ఇంటర్‌నెట్ ద్వారా ఎలా తెలుసుకోవచ్చుననేది వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.నాగసురేష్, తదితరులు పాల్గొన్నారు.



సురేఖ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బూరగడ్డ శ్రీకాంత్

సర్పంచ్ కుటుంబసభ్యులకు బూరగడ్డ పరామర్శ

గుడివాడ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): దొండపాడు సర్పంచ్ చోరగుడి సురేఖ విద్యుత్ షాక్‌కు గురై ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురేఖ ఎంతో చురుగ్గా కార్యక్రమాల్లో పాల్గొంటుండేవారన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ మండల జనసేన పార్టీ అధ్యక్షులు ఇంటూరి గజేంద్ర, గ్రామ జనసైనికులు కాకి బాబ్జీ, గుడివాడ రవి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

గుడివాడ, మే 21 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా బకాయిపడిన జీతాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ కొద్దిపాటి జీతాలతో ఆర్థాకలితో జీవిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు నిలిపివేయడం భావ్యం కాదన్నారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం అధ్యక్షురాలు లూర్దుమేరీ, నాయకులు లక్ష్మీ పాల్గొన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛను హరించటం దారుణం

గుడివాడ, మే 21(ఆంధ్రజ్యోతి) : బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ఆ పార్టీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాల్లో బావ ప్రకటనా స్వేచ్ఛను హరించే ప్రయత్నాలను చేస్తున్నారని సాహితీ స్రవంతి అధ్యక్షుడు లంకా సురేంద్ర, ఐద్వా కార్యదర్శి పి.రజినిలు ఆరోపించారు. బుధవారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల మహారాష్ట్రలోని ముంబాయిలో నటుడు, వీర్‌సత్‌దార్ జ్ఞాపకార్థం జరిగిన కార్యక్రమంలో ప్రఖ్యాత కవి ఫైసజ్ అహ్మద్‌కవిత "హమ్‌దేఖేంగే"ను గానం చేసిన యుద సాంస్కృతిక బృందంపై భారత న్యాయసంహిత సెక్షన్ 152, సెక్షన్ 196, సెక్షన్ 353 ప్రకారం కేసులు పెట్టడం భావప్రకటనా స్వేచ్ఛను హరించడమేన్నారు. తక్షణమే కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వ దుశ్చర్యను సాహితీ సంస్థలు, ప్రజాస్వామికవాదులు ముక్తకంఠంతో ఖండించాలని సురేంద్ర, రజిని తదితరులు కోరారు.

రహదారి అధ్వానం

(ఆంధ్రజ్యోతి - పెదపారుపూడి): గుడివాడ - కంకిపాడు మార్గమధ్యలో పెదపారుపూడి నుంచి వానపాముల విశ్వభారతి వైస్ పుడ్స్ వరకు ప్రధాన రహదారి గుంతలమయమై అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఈ రోడ్డుపై 10 టైర్ల టిప్పర్లు మట్టి లోడ్‌తో తిరుగుతుండటంతో రహదారిపై భారీస్థాయిలో గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. రోడ్డుమధ్యలో భారీ గోతులు పడటంతో వాహనాలు గోతులు తప్పించటానికి వాహనాన్ని రోడ్డు మార్జిన్ దిగాల్సి వస్తుందని అంటున్నారు. దీంతో వాహనాలు అదుపు తప్పి రోడ్డు ప్రమాదాల భారీన పడక తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు అధికారులు స్పందించి రోడ్డునిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు కాలేదు

రహదారి మరమ్మతుల నిమిత్తం అంచనాలు సిద్ధం చేసి ఉన్నతదాధికారులకు పంపించాం. నిధులు మంజూరవగానే రహదారికి మరమ్మతులు పనులు చేపడతాం.

వెంకట కిషోర్, ఆర్‌అండ్‌బీ డీఈ



గుంతలమయంగా మారిన పెదపారుపూడి - వానపాముల రహదారి